వేగవంతంగా పరిహారం పంపిణీ

- జాతీయ రహదారులకు భూసేకరణ 90 శాతం పూర్తి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులకు సంబంధించి భూనిర్వాసితులకు పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు వివరించారు. మంగళవారం విజయవాడ సచివాలయం నుంచి రాష్ట్రంలో జాతీయ రహదారుల భూసేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసుల అంశంలో జిల్లాల వారీగా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జాతీయ రహదారుల ప్రగతిని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. ఎన్‌హెచ్-440 రాయచోటి నుంచి వేంపల్లె వరకు చేపట్టిన రహదారికి సంబంధించిన 95 శాతం భూసేకరణ పూర్తి చేశామని, ఇందులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద రూ.11 కోట్లకు పోర్టల్‌లో నమోదు చేశామని, త్వరలోనే ఆయా రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ అవుతుందని చెప్పారు. ఎన్‌హెచ్-716 కడప-రేణిగుంట నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా జిల్లాలో వెళుతున్న జాతీయ రహదారికి సంబంధించి దాదాపు 80 శాతం భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. అలాగే ఎన్‌హెచ్-71 మదనపల్లె-పీలేరు సెక్షన్ నాలుగు వరుసల రహదారికి సంబంధించి కూడా 90 శాతం భూసేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి చేసిన భూసేకరణకు పరిహారం కూడా సంబంధిత రైతులకు చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. ఆయా ప్రాజెక్టుల్లో ఇంకా మిగిలి ఉన్న భూసేకరణకు చర్యలు వేగవంతం చేశామన్నారు. పరిహారం చెల్లింపునకు సంబంధించి సంబంధిత రైతులు సరైన ధ్రువీకరణ పత్రాలు అందచేస్తే వెంటనే వారికి కూడా పరిహారం చెల్లింపు చేస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- భవనాలను పరిశీలించిన కేవీఎస్ ప్రిన్సిపాల్, సబ్‌కలెక్టర్



కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మునేష్‌మీనా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మదనపల్లెకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని ఏప్రిల్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు కడప కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మునేష్‌మీనా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన 6.09 ఎకరాల స్థలాన్ని, అనంతరం పట్టణంలోని ఎస్టీ రెసిడెన్సియల్ స్కూల్ పక్కన కేంద్రీయ విద్యాలయం కోసం నిర్మించిన తాత్కాలిక భవనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మునేష్‌మీనా మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో ఐదు తరగతులు నిర్వహించడానికి 18 గదులు అవసరమని, ఇక్కడ 16 గదులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

వీటికి తోడు విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మించిన తాత్కాలిక భవనాల పక్కనే ఉన్న ఆరు మరుగుదొడ్లకు అదనంగా ఉన్న స్థలంలో అవసరమైన మేరకు మరుగుదొడ్లు నిర్మిస్తామని, దీంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుత సౌకర్యాలకు కేంద్రీయ విద్యాలయ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని, అంతా సవ్యంగా జరిగితే ఫిబ్రవరి లేదా మార్చిలో కేంద్రీయ విద్యాలయ అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరిగే అడ్మిషన్లతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఎస్టీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, సర్వేయర్ రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు తీయరా...!

- ఊరూరా బెల్టు దుకాణాలు
- విచ్చలవిడిగా గ్రామాల్లో అమ్మకాలు
- ఖద్దరుబాబుల అండతో బార్లలా మద్యంషాపులు



కోడూరులో నిబంధనలకు విరుద్ధంగా షాపు వద్దే అరుగుల మీద మద్యం తాగుతున్న మందుబాబులు

రైల్వేకోడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తే దాడులు చేస్తాం.. కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అలా జరగడం లేదు. ఏ పల్లెలో చూసినా బెల్టు దుకాణాలు దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గంలో ఊరూరా బెల్టు దుకాణాలు వెలిశాయి. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు నేతల అండతో ఈ తతంగం నడుస్తోందని ప్రజలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బెల్టు దుకాణాలకు మద్యంషాపుల యజమానులు భారీ ఎత్తున మద్యం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రైల్వేకోడూరు మండలంలో 11, ఓబులవారిపల్లె మండలంలో 4, పుల్లంపేట మండలంలో 3, పెనగలూరు మండలంలో 3 మద్యంషాపులు ఉన్నాయి. మద్యం షాపులు ఏర్పాటైన నెల వరకు బెల్టుషాపులు లేకుండా చేశారు. అనంతరం బెల్ట్‌షాపులను అధికారులే ప్రోత్సహిస్తూ షాపుల యజమానులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో షాపుల యజమానులు తమ షాపు పరిధిలోకి వచ్చే గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయా మండలాల నుంచి ప్రతి గ్రామానికి మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉన్న బెల్టు దుకాణ యజమాని నుంచి రూ.2 లక్షలు స్టాకు కోసం షాపుల యజమానులు తీసుకున్నట్లు పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ ఫలితం లేదు. మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్ముతున్నా బెల్ట్ షాపుల్లో మాత్రం ఎంఆర్‌పీ కంటే అధిక రేటుతో విక్రయాలు చేస్తున్నారని మందుబాబులు చెబుతున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండల కేంద్రాల్లో ఉన్న మద్యం షాపుల వద్ద అనుమతులు లేకపోయినా షాపు పక్కనే రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని బార్లలో మాదిరిగా మద్యం తాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదేందని కొందరు ప్రశ్నిస్తే మాకు రాజకీయ నాయకుల అండ ఉంది.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని షాపుల యజమానులు అంటున్నట్లు చెబుతున్నారు.

కోరలు చాస్తున్న నాటుసారా

నియోజకవర్గంలో నాటుసారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో కె.బుడుగుంటపల్లె, వై.కోట, చెన్నరాజుపోడు తదితర ప్రాంతాల్లో నాటుసారా విచ్చలవిడిగా సాగేది. అప్పట్లో అధికారులు ఆయా ప్రాంతాల్లోనే ఎక్కువగా దాడులు చేసి అరికట్టేవారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో నాటుసారా తయారీకి ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. నాటుసారాపై దాడులు నామమాత్రంగా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరంతరాయంగా దాడులు చేస్తున్నాము

- తులసి, సీఐ, రైల్వేకోడూరు ఎక్సైజ్

బెల్టుదుకాణాలపై దాడులు నిరంతరాయంగా చేస్తున్నాము. రెండు నెలల్లో మూడు మండలాల్లో 14 కేసులు నమోదు చేసి ఒక వాహనం సీజ్ చేశాము. మేము ఎవరి దగ్గర ముడుపులు తీసుకోవడం లేదు. నాటుసారాపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. వై.కోటలో ఇటీవల 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశాము. చిట్వేలి మండలంలో ఒకరి దగ్గర నాటుసారా ఉండటంతో పట్టుకున్నాము. 20 మందిని బైండోవర్ చేశాము.



రైల్వేకోడూరులో బహిరంగ ప్రదేశంలోనే మద్యం తాగుతున్న మందుబాబులు



మద్యం షాపు పక్కనే రేకులు, అరుగులు వేసి మద్యం తాగిస్తున్న దృశ్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సాయిలోకేశ్

- రెండోసారి నియామకం



సాయిలోకేష్‌కుమార్

రాజంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సాయిలోకేశ్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్లుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ నిర్వహించే కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేస్తూ రాజంపేట పార్లమెంట్‌లో బీజేపీని ముందుకు తీసుకుపోవడంలో ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన సేవలను గుర్తిస్తూ బీజేపీ రాష్ట్ర అధిష్టానం తిరిగి ఆయనను రెండోసారి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్ అల్లుడైన సాయిలోకేశ్‌కుమార్ రాజంపేట పార్లమెంట్‌లో సుపరిచితులు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనను రెండోసారి నియమించడం ఆనందంగా ఉందని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నేతృత్వంలో, రాష్ట్ర, జిల్లా నాయకుల సహకారంతో జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి అన్నమయ్య జిల్లాలో పార్టీని మరింత ముందుకు తీసుకెళతానని తెలిపారు. తనను నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కన్నెమడుగు సొసైటీలో..
బంగారు మోసం..!

- రూ.37 లక్షల అక్రమాలు
- రీఅప్రైజింగ్‌తో వెలుగులోకి..
- కొనసాగుతున్న విచారణ..



తంబళ్లపల్లె మండలం కన్నెమడుగులోని సహకార సొసైటీ

మదనపల్లె, జనవరి 21: రైతులు, ఖాతాదారుల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాల్సిన సహకార సొసైటీల్లో ఇప్పటికీ మార్పు రావడం లేదు. కొన్ని సొసైటీలు అన్నివిధాలా ముందుంటూ లాభాల్లో పయనిస్తుండగా, మరికొన్ని మాత్రం తమ పంథాను మార్చుకోలేదు. కంచే చేను మేసిన చందంగా సంస్థను కాపాడాల్సిన ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా అవినీతికి సహకరిస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నారు. తాజాగా తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సింగిల్‌విండో)లో ఇలాంటి వ్యవహారమే వెలుగులోకి వచ్చింది. ఇక్కడ రైతులు, కస్టమర్లకు బంగారం తాకట్టుపై రుణాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా నకిలీ లేదా పర్సెంటేజ్ తక్కువగా ఉన్న బంగారంపై రుణాలు ఇచ్చినట్లు తేలింది. ఇలా రూ.37 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో బ్యాంకు ఉద్యోగితో పాటు అప్రైజర్ ప్రమేయం ఉన్నట్లు ఆ శాఖాధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా బంగారంపై రుణం తీసుకున్న కస్టమర్లను సొసైటీకి పిలిపించి విచారణ చేస్తున్నారు. లోన్ క్లియర్ చేయమని సూచిస్తున్నారు. మదనపల్లె సహకారశాఖ డివిజన్ పరిధిలోని వివిధ సొసైటీల్లో రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు సభ్యులకు వ్యాపార, బంగారంపై తాకట్టు రుణాలు ఇస్తున్నారు. చిత్తూరు సెంట్రల్ బ్యాంకు రుణం మంజూరు చేస్తుండగా, దాని పరిధిలోని డీసీసీబీ బ్రాంచ్‌ల పర్యవేక్షణలో సొసైటీలు ఇస్తుంటాయి. ఇందులో భాగంగా కురబలకోట డీసీసీబీ బ్రాంచి పరిధిలోకి వచ్చే తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సొసైటీలోనూ బంగారు రుణాలు ఇచ్చారు. అనంతరం ఏటా జనవరిలో లేదా ఏడాదికి రెండుసార్లు ఆయా సొసైటీల్లో రీఅప్రైజింగ్ పేరుతో డీసీసీబీ బ్రాంచి మేనేజర్ లేదా సూపర్‌వైజర్ ఇతరబ్యాంకు అప్రైజర్‌లతో కలసి తనిఖీ చేస్తారు. ఈ క్రమంలో అప్పటికే రైతులు, ఇతర ఖాతాదారుల పేరున మంజూరు చేసిన బంగారాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. బ్యాగు ఓపెన్ చేసి అసలు తాకట్టు పెట్టింది బంగారమేనా? నకిలీదా? పర్సెంటేజ్ ఎంత ఉంది? గ్రాస్, నెట్ ఎంత? క్వాంటిటీకి మించి డబ్బులు ఇచ్చారా? అన్నది పరిశీలిస్తారు. ఇందులో భాగంగా అంగళ్లు డీసీసీబీ బ్రాంచ్ అధికారులు ఇదే తరహాలో ఇటీవల కన్నెమడుగు సొసైటీలో బంగారాన్ని తనిఖీ చేశారు. ఇందులో నకిలీ బంగారం ఉన్నట్లు తెలిసింది. అయితే బ్యాంకు అధికారులు యాభై శాతం మాత్రమే పర్సెంటేజ్ ఉన్న బంగారం బయటపడినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో బంగారం విలువ కంటే రూ.37 లక్షల మేర అదనంగా ఖాతాదారులకు ఇచ్చినట్లు తేల్చారు. ప్రస్తుతం అధికారులు బ్యాంకులో రుణం మంజూరైనట్లు ఉన్న పేర్లను పిలిపించి విచారిస్తున్నారు. ఇలా మొత్తం 17 మంది పేర్లు ఉన్నట్లు గుర్తించగా, నిజంగా వీళ్లే సొసైటీలో బంగారంపై రుణం తీసుకున్నారా? లేక ఇంటిదొంగలే వారి పేరున ఎంటర్ చేసి డబ్బులు తీసుకున్నారా? అన్నది తేల్చేపనిలో ఉన్నారు.



మూడెకరాల్లో 30 రకాల మొక్కలు

- సేంద్రియ, సమీకృత వ్యవసాయంపై యువకుడి ఆసక్తి
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సన్నకారు యువరైతు
- సమీకృత వ్యవసాయంలో విరగ్గాసిన మునక్కాయలు

వివరాలు 6లో...

పటిష్టంగా ఎంఎస్ఎంఈల సర్వే

- ప్రతి ఎంఎస్ఎంఈ 'ఉద్యం' రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలి
- కలెక్టర్ శ్రీధర్

వివరాలు 6లో...

మూడెకరాల్లో 30 రకాల మొక్కలు

- సేంద్రియ, సమీకృత వ్యవసాయంపై యువకుడి ఆసక్తి
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సన్నకారు యువరైతు
- సమీకృత వ్యవసాయంలో విరగ్గాసిన మునక్కాయలు
- ఏపుగా పెరుగుతున్న వివిధ రకాల మొక్కలు



నూతన వంగడాలు మామిడి, టెంకాయ మొక్కలు

పెద్దతిప్పసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఉన్న మక్కువతో తమకున్న నాలుగెకరాల పొలంలో మూడెకరాల్లో 30 రకాల పంటలను పండిస్తూ సమీకృత, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ సన్నకారు యువరైతు. పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెకు చెందిన యువ రైతు శ్రీనివాస్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్మీడియట్ చదువుతూ వ్యవసాయంపై మక్కువతో ఈ రంగంలోకి దిగాడు. అతడికి ఉన్న నాలుగెకరాల పొలంలో మూడెకరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాడు. అర ఎకరా భూమిలో మునగ సాగు చేయాలని భావించి దక్షిణాఫ్రికా నుంచి రూ.45 వేలు వెచ్చించి ము నగ గింజలను తెప్పించి నారు పోసి సంవత్సరం క్రితం నాటించాడు. ఆ మునగ పంట ఇప్పుడు మంచి దిగుబడి ఇస్తోంది.

సేంద్రియ పద్ధతుల్లో 30 రకాల చెట్ల పెంపకం

సేంద్రియ పద్ధతులను అవలంభించి 2 ఎకరాల్లో రాజమండ్రి నుంచి టెంకాయ చెట్లు గంగాబోండ, రామ్‌గంగా, చెనంగి, రెడ్‌బోండా, కోడ్ కోకోనట్ ట్రీ, పర్పామెడ్‌ట్రీ, మోడ్‌గ్రీన్, మోడ్ ఆరెంజ్, మాలయాన్‌గ్రీన్, టీఎక్స్‌డి, కూట్టానట్టై, మాండ్యా అనే వివిధ రకాల టెంకాయచెట్లు 300 పైగా సాగు చేశాడు. పండ్ల చెట్లు అయిన గ్రీన్ అవకాడో, బ్లాక్ అవకాడో, వాటర్ ఆపిల్, బ్లాక్ సపోట, ఆరెంజ్, అంజీర, బిర్యానీ ఆకు, యాలక్కీ, బ్లాక్ మిరియాలు, వెనీలా, వంటి పండ్ల సాగు, మహాగని చెట్లు 500 మొక్కలకు పైనే సాగు చేశాడు.

నిమ్మ, దానిమ్మ, మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. టెంకాయ చెట్లు మూడు నుంచి నాలుగు లీటర్ల కొబ్బరి నీళ్లు కలిగి ఉంటాయని తనకు దక్షిణాఫ్రికాలో తెలిపారని, అందుకే అక్కడి నుంచి తెప్పించి నాటినట్లు తెలిపారు. టెంకాయ చెట్లు రెండు మూడేళ్లలో కాపుకు వస్తాయని ఆ రైతు తెలిపాడు. 60కి పైగా టేకు మొక్కలు కూడా పెంచుతున్నాడు. ఇలా ఎక్కడా లేని రీతిలో అత్యధిక మొక్కలను పొలంలో ఆ రైతు చక్కగా సాగు చేశాడు. ముఖ్యంగా ఈ పంటలకు దిబ్బ ఎరువులు, వివిధ రకాల ఆకులతో తయారు చేయబడిన ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నాడు. వివిధ రకాల ఆకులను కోసి పొలంలోనే ఓ పెద్ద గొయ్యి తీసి వాటిని కప్పి పెట్టి వాటిని బాగా కుళ్లబెట్టిన తరువాత దానిని ఎరువుగా వినియోగిస్తున్నాడు. దాదాపు ఆ యువరైతు ఇప్పటికే రూ.7 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి వివిధ రకాల మొక్కలను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి సమీకృత వ్యవసాయం విధానంతో ఇక్కడ సాగు చేస్తుండడం విశేషం. మూడు ఎకరాల పొలంలో ఇన్ని రకాల చెట్లు, పంటలు సాగు చేస్తుండడం ఈ ప్రాంతంలో విశేషంగా చెప్పుకుంటున్నారు. సమీకృత, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇలాంటి యువ రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తే సేంద్రియ వ్యవసాయం మరింత విస్తృతంగా ఇంకా పలువురు రైతులు చేపట్టేందుకు అవకాశాలు మెరుగవుతాయి.


విరగ్గాసిన మునక్కాయలు


ఏపుగా పెరుగుతున్న మహాగని మొక్కలు


అవకాడో


యువ రైతు శ్రీనివాస్

గేదెలు, ఎద్దుల అక్రమ తరలింపు

- వాహనాన్ని అడ్డుకున్న టీడీపీ, బీజేపీ నాయకులు
- 28 గేదెలు, ఎద్దులు స్వాధీనం ● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు


ఒకే లారీలో ఆవులు, గేదెలను కుక్కి తరలిస్తున్న దృశ్యం

సుండుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గేదెలు, ఎద్దులను తరలిస్తున్న వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మంగళవారం కూటమి నాయకులు, స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీలో ఉన్న 19 గేదెలు, 9 ఎద్దులను కిందికి దింపి పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలోనికి తరలించారు.

గుంటూరు జిల్లా వినుకొండ నుంచి పీలేరు నియోజకవర్గంలోని కలికిరి మండలానికి వాటిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, కోర్టు అనుమతితో ఆయా పశువులను గోశాలకు తరలిస్తామని వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, టీడీపీ నాయకులు సోమిశెట్టి మస్తాన్‌బాబు, రామరాజు, గంటల సిద్దయ్య, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గేదెల అపహరణ

మండలంలో మడితాడు గ్రామ పంచాయతీ నడింతురకపల్లికి చెందిన సాబ్‌జాన్, మడితాడుకు చెందిన జయపాల్‌కు చెందిన రెండు గేదెలు సోమవారం అర్ధరాత్రి అపహరణకు గురైనట్లు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ ఒక్కొక్కటి సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

నిర్మలగిరి కాలనీలో వరుస చోరీలు


బీరువా పగులగొట్టిన దొంగలు

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారిలోని కిరాణాషాపు, నిర్మలగిరి కాలనీలోని గృహంలో సోమవారం రాత్రి దొంగలు నగదు అపహరించుకు వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి పక్కనే ఉన్న తన కుమారుడు ఇంటికి వెళ్లానని మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న పొదుపు మొత్తం రూ.8 వేలు అపహరించుకు వెళ్లారని లక్షుమ్మ తెలిపింది. అలాగే దుకాణం తాళాలు తొలగించి 4 వేల రూపాయలు, కొన్ని వస్తువులు తీసుకెళ్లారని కిరాణాషాపు యజమాని నరసయ్య తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

మదనపల్లె బస్టాండులో వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధితో మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్‌లో వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు కదిరి పట్టణం నానా దర్గా వీధికి చెందిన సాబ్‌జాన్ కుమారుడు సాదిక్‌వల్లి పదిరోజుల క్రితం మదనపల్లె పట్టణంలోని దర్నీపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి ఉరుసు సందర్భంగా బయటకు వచ్చి బెంగళూరు బస్టాండ్‌లో మూర్ఛ వ్యాధితో కుప్పకూలి అక్కడే మృతి చెందాడన్నారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికిలోని మార్చురికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు.

పటిష్టంగా ఎంఎస్‌ఎంఈల సర్వే

ప్రతి ఎంఎస్‌ఎంఈ 'ఉద్యం' రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలి : కలెక్టర్ శ్రీధర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంఎస్‌ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఎస్‌ఎంఈల సర్వే అంశంపై జిల్లా పరిశ్రమల శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఎంఎస్‌ఎంఈ సర్వే-2024ను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని, అందువల్ల అన్ని పరిశ్రమలు, సేవా రంగాలు, వ్యాపార సంస్థలు ఉద్యం రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలని తెలిపారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు పరిశ్రమలశాఖ అధికారులు, కమర్షియల్ ట్యాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణారావు, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మిపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, వయోజన విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన అక్షర వెలుగులు, మార్గదర్శినిలు, వాల్ స్టిక్కర్ క్యాలెండర్లు అటెండెన్స్ రిజిస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది అన్నమయ్య జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధించి రాష్ట్రంలో ఒక రోల్ మోడల్‌లా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, రాయచోటిలోని డైట్‌లో అన్నమయ్య జిల్లాలోని ఎంపీడీవోలు, ఏపీఎంలకు ఉల్లాస్ కార్యక్రమంపైన జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగిందని, జిల్లాలో అభ్యాసకులుగా నమోదైన 13,767 మందిని లక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఎంపీడీవోలు, ఏపీఎంలు శిక్షణ పొందారని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరాజపురంలో చోరీ


దొంగలు పగలగొట్టిన బీరువా

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో దొంగలు పడి నగలు అపహరించుకు వెళ్లినట్లు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ నల్లరాళ్లమిట్టకు చెందిన మురళీ మోహన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నవీన్‌బాబు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి ఊరికి వెళ్లిన బాధితుడు మంగళవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉండడం కనిపించిందని పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న సుమారు 80 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన గంగయ్య (37) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతను మద్యానికి బానిస కావడంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవని కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంట్లో నుంచి వెళ్లిన అతను మంగళవారం ఆటోలో మృతి చెంది కనిపించాడు. ఈ మేరకు గంగయ్య తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్


సమావేశంలో మాట్లాడుతున్న రజాక్

మదనపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సంక్షేమానికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని కడప జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్ తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో మదనపల్లెలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబానికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, రాయితీ, అభివృద్ధి పథకాలను వివరించారు.

కొత్తగా ఉద్యోగ విరమణ చెందిన సైనికులకు ఐడెంటిటీ కార్డు, కుటుంబ పెద్ద మరణిస్తే, భార్యకు, పిల్లలకు ఐడెంటిటీ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలు మారిన నేపథ్యంలో కార్డులో కరెక్షన్లు చేసి కార్డులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. మాజీ సైనికులు మరణిస్తే దహనక్రియలకు క్యాంటిన్ ద్వారా, జిల్లా వెల్ఫేర్ ద్వారా ఎంత మొత్తం వస్తుందో, దాన్ని ఎలా తీసుకోవాలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ పొందడం, హాస్పిటల్‌లో చేరితే వైద్యం పొందడానికి చేసుకునే దరఖాస్తు, తదితర అంశాలను వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, మరో వైపు వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో మాజీ లెఫ్టినెంట్ కర్నల్ బాషా, వైస్ ప్రెసిడెంట్ సి.లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, సభ్యులు బీమారెడ్డి, సురేష్‌బాబు, పి.వి.రెడ్డి, సత్యనారాయణ, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీలో వసూళ్లపై విచారణ


కంబాలపల్లెలో విచారిస్తున్న డీటీ వెంకటరెడ్డి

బి.కొత్తకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ఏజన్సీ నుంచి వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సిబ్బంది చేతివాటంపై సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్‌పల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో డెలివరీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేలింది.

లబ్ధిదారులు ఉచితగ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన రూ.839కి అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్‌సప్లైస్ అధికారి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె సవిల్‌సప్లైస్ డీటీ బి.కొత్తకోట మండలంలో వినియోగదారులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం స్థానిక గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌లతో సమావేశమయ్యారు. అదనపు వసూళ్లకు పాల్పడి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లుపొడవద్దని నిర్దేశించిన ధరను మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. ఇకపై అదనపు వసూళ్లకు పాల్పడినట్లు రుజువైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి పరిశీలన

- కబ్జా భూమిలో బోర్డు నాటిన అధికారులు ● స్టేటస్‌కో ఉందని తిరిగి తొలగింపు

బి.కొత్తకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు రెవెన్యూ పరిధిలో భూకబ్జా జరిగిందంటూ వెళ్లిన ఫిర్యాదుపై మంగళవారం బి.కొత్తకోట రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ కథనం మేరకు వివరాల్లోకెళితే... గ్రామంలోని సర్వే నెంబరు 1117లో 4.53 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెడ్డెప్ప కబ్జా చేసి, తన స్వాధీనంలో ఉంచుకున్నాడని ఆరోపించారు.

దానికి విముక్తి కల్పిస్తే ప్రభుత్వ భవనాల నిర్మాణానికో, పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడానికో ఉపయోగ పడుతుందని అదే గ్రామానికి చెందిన నరసింహులు కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ ఫిర్యాదుపై విచారణ చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. మంగళవారం తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వో రాంప్రసాద్ గట్టు గ్రామానికి వెళ్లి ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టడానికి ప్రయత్నించారు. ఇంతలో భూమి ఆక్రమించినట్టు చెబుతున్న వ్యక్తి అక్కడికి వచ్చి, ఆ భూమిని అనాదిగా సాగు చేసుకుంటున్నామని, దీనిపై స్టేటస్‌కో ఉన్నట్టు కోర్టు ఆదేశాల ప్రతిని చూపాడు. దీంతో బోర్డును తొలగించారు. ఫిర్యాదు వచ్చిన భూమిపై కోర్టు యథాతథస్థితిని కొనసాగించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ


- మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పతకాల పంట
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు


రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న విద్యార్థులు


రోప్ స్కిప్పింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ (తాడుఆట)లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. రైల్వేకోడూరుకు చెందిన జోగినేని వైష్ణవి అండర్-14, 17, 19 విభాగాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించింది. నితీషకుమార్‌రాజు అండర్-14, 17, 19 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. జోషిత అండర్-19 విభాగంలో బ్రాంజ్, సిల్వర్ పతకాలు సాధించింది. సుమ అండర్-17, 19 విభాగాల్లో బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం వేళలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జోషిత, వైష్ణవి, నితీష్‌కుమార్ రాజు, సుమ త్వరలో లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతున్నారు.


జాతీయ స్థాయిలో విజయం సాధిస్తా



జాతీయ స్థాయి క్రీడల్లో విజయం సాధిస్తాను. గ్రామీణ స్థాయి నుంచి పోటీల్లో పాల్గొంటూ మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మళ్లీ రాష్ట్ర స్థాయిలో పాల్గొని బంగారు పతకాన్ని సాధిస్తాను. ఇప్పటికే చాలా మెడల్స్ సాధించాను. ఇంకా సాధిస్తాను.

-జోగినేని వైష్ణవి

ప్రత్యేక శిక్షణ



రోప్ స్కిప్పింగ్ పోటీలకు వెళ్లే విద్యార్థులకు మంచి తీర్పిదు ఇస్తున్నాము. ఉదయం లేవగానే విద్యార్థులు వారి ఇళ్లలోనే ప్రాక్టీసు చేసి స్కూలుకు వస్తారు. క్లాసులు పూర్తి కాగానే మళ్లీ రోప్ స్కిప్పింగ్ లో మెలకువలు నేర్పిస్తాము. విద్యార్థులు ఈ క్రీడలో బాగా రాణించాలనే ఉద్దేశంతో స్పీడు పెంచేటట్లు శిక్షణ ఇస్తున్నాము.

-కట్టా వెంకటేష్, కోచ్

పాడి రైతుకు వెన్నుదన్నుగా...

- పశుసంపదపై ప్రత్యేక దృష్టి సారించిన కూటమి సర్కార్
- నెలాఖరు వరకు ప్రత్యేక పశు ఆరోగ్య శిబిరాలు
- రూ.1.020 కోట్ల విలువైన మందులు సరఫరా

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి రంగం, పశుసంపదపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా పశుగ్రాస పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చింది. పశువులు, జీవాలకు మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజాప్రయోజన పనులు చేపట్టేందుకు పల్లె పండుగ పేరుతో సిమెంటు రహదారులు, ప్రహరీల నిర్మాణంతోపాటు పాడి పశువులకు ఉపయోగపడేలా గోకుల షెడ్ల నిర్మాణాలను చేపట్టింది. దీంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణకు అవసరమైన మౌలిక వసతులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయడంతో పాడి రైతుల్లో సంబరాలు మిన్నంటాయి. తాజాగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం, వ్యాధి నిరోధక టీకాలు, పశుసంబంధిత వ్యాధులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

జిల్లా పశుసంపద

జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్షంగా పాడి కలిగిన రైతులు ఉన్నారు. 3.99 లక్షల గేదెలు, 44 వేల ఆవులు, ఎద్దులు, 3.80 లక్షల మేకలు, 9.20 లక్షల గొర్రెలు ఉన్నాయి. జిల్లాలో 17 ప్రాంతీయ పశువైద్యశాలలో 78 పశువైద్యశాలలు, 224 రైతు సేవా కేంద్రాల పరిధిలో పశువైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద పశువులకు కూడా ఈసారి నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. పశుఆరోగ్య శిబిరాల్లో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు చేపట్టారు. జిల్లాలో ప్రతి మండలానికి 2 నుంచి 3 బృందాలు ఈనెల చివరి వరకు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలు అందిస్తున్నారు.



రాచాయపేటలో మేకలకు నట్టల నివారణ మందులను తాపిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ, పక్కన డీడీ రమణయ్య

సమృద్ధిగా మందులు సరఫరా

జిల్లాలో ప్రత్యేక పశుఆరోగ్య శిబిరాల కోసం రూ.1.20 కోట్ల రూపాయల విలువగల నట్టల నివారణ మందులు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యాయి. వీటిలో పెద్దపశువుల కోసం రూ.67 లక్షలు, దూడల కోసం రూ.5 లక్షలు, మేకలు, గొర్రెల కోసం రూ.30 లక్షలు విలువచేసే మందులు కేటాయించారు. వీటిని అన్ని కేంద్రాలకు చేరవేసినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సి.శారదమ్మ తెలిపారు. వీటితోపాటు జిల్లాకు రెగ్యులర్‌గా రావాల్సిన క్వార్టర్లీ వాటా కింద రూ.1.30 కోట్ల రూపాయల మందులు కూడా సరఫరా అయ్యాయని, అవసరమైతే వీటిలో నుంచి కూడా వైద్యశిబిరాలకు చికిత్స కోసం మందులను వినియోగిస్తామని వివరించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జాతీయ కృత్రిమ గర్భాధారణ ద్వారా పుట్టిన లేగా దూడల ప్రదర్శనకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో నిర్వహిస్తున్న 20 క్యాంపుల్లో ఒక్కో క్యాంప్‌కు రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు విడుదల చేశారని తెలిపారు. ఈ శిబిరాల్లో దూడలకు నట్టల నివారణ మందులు, విటమిన్-ఎ, టీకాలు, సమృద్ధిగా దూడల పెరుగుదలకు లివర్‌టానిక్స్, కాల్షియం టానిక్, మట్టి తినకుండా సాల్ట్‌లిక్స్‌తోపాటు రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రోత్సాహక బహుతులను అందిస్తున్నట్లు వివరించారు. గోడపత్రాలు, అవగాహన సదస్సుల ద్వారా ప్రచారం చేస్తూ అందిస్తున్న ఈ సేవలను పాడి రైతులు, పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రారంభమైన పీజీ పరీక్షలు

- తొలిరోజు 96 శాతం మంది హాజరు


పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డి, తదితరులు

కడప ఎడ్యుకేషన్ జనవరి 21, (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం వైవీయూ ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో జరుగుతున్న పరీక్షలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి క్రిష్ణారావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వాహణపై సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయినిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ తొలిరోజు 560 మంది విద్యార్థులకు 540 (96 శాతం) మంది హాజరయ్యారన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్...



కడప ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల అర్హత పత్రాల పరిశీలన సీట్ల కేటాయింపు జరిగింది. కౌన్సెలింగ్ కేంద్రాన్ని వైస్ చానల్సర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, పరీక్షల నిర్వహణాధికారి కేఎస్‌వీ క్రిష్ణారావ్ సందర్శించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసుకున్న వారికి లేటరల్ ఎంట్రీ విధానంలో యేడాది పీజీ డిగ్రీకి తొలిసారిగా ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ వి.రామకృష్ణ, గణేష్‌నాయక్, మునికుమారి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యాపారి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి పుంగనూరు సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మంగళవారం అన్నమయ్య జిల్లాకు చెందిన బొంతల వ్యాపారి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన నరంగయ్య కుమారుడు శ్రీనివాసులు(35) కొద్దిరోజుల క్రితం బొంతల వ్యాపారం కోసం పుంగనూరుకు వచ్చి నక్కబండ వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టిక్ ట్యాంక్ ప్రమాదంలో మరో వ్యక్తి మృతి


అరుణ్‌కుమార్ మృతదేహం

కడప క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురంలోని ఆచారి కాలనీలో సోమవారం సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిక్కిరి అరుణకుమార్ (39) మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. అరుణ్‌కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబసభ్యులు బోరున విలపించారు.

ముష్టి చెక్క, బెల్లం తిని మహిళ మృతి

సుండుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముష్టి చెక్క, బెల్లం తిని మండలంలోని తాటిగుంటపల్లెకు చెందిన తుమ్మలరాజు సులోచన మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈమె ఒక్కోసారి ఇంట్లో నుంచి వెళ్లిపోతూ ఉంటుందని, అలాంటపుడు భర్త ఇంటికి పిలుచుకుని వచ్చేవాడని తెలిపారు. సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురైన ఆమె తాను ముష్టి చెక్క తిన్నట్లు భర్త కుమార్‌రెడ్డికి చెప్పడంతో వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి విషయంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చాపాడు జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రతాపరెడ్డి అనే ఉపాధ్యాయుడిని డీఈవో మీనాక్షి మంగళవారం సస్పెండ్ చేసినట్లు ఎంఈవో వంశీకృష్ణ తెలిపారు. ప్రతాపరెడ్డి విధులకు సక్రమంగా హాజరు కాకుండా, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనందున సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఆదాయపు పన్నుపై వడ్డీ మినహాయింపు

- ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్

ప్రొద్దుటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను వడ్డీ మినహాయింపుతో పాటు జరిమానాలు, శిక్షలను మాఫీ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాద్ సె విశ్వాస్ పథకాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో వివిధ వాణిజ్య సంఘాలు, ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఘాలకు వివాద్ సె విశ్వాస్ పథకం అడ్వాన్స్ టాక్స్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు రేంజ్ ఆదాయపు పన్ను అడిషనల్ కమిషనర్ శరత్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివాద్ సె విశ్వాస్ పథకం తీసుకువచ్చారన్నారు. ఈ పథకం ద్వారా అప్పీల్ దాఖలు చేసిన పన్ను చెల్లింపుదారులు జనవరి 31 లోపు దరఖాస్తు చేయాలన్నారు. ఈ పథకం వలన ఆదాయపు పన్నుకు వడ్డీ మిన హాయింపుతో పాటు పెనాల్టీలు, శిక్షలు మాఫీ అవుతాయన్నారు. కేవలం పన్ను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. అడ్వాన్స్ టాక్స్ పన్నుచెల్లింపు దారులు వారి వార్షిక ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయపు పన్ను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించిందన్నారు. సదస్సులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శశివర్ధన్, టాక్స్ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షుడు మేడా చంద్రశేఖర్, కడప చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సాదుగోపాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసేటప్పుడు మనసు, శరీరం ఒకే విధం గా పనిచేయాలని.. ఇతర ఆలోచనలతో వాహనాలు నడపరాదని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పులివెందుల ఆర్టీవో కార్యాలయంలో ఆటోడ్రైవర్లు, ప్రైవేటు బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈనెల 31లోపు పన్ను లు చెల్లించకపోతే 30 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారుల కంటపడితే 200 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు గడువు ముందే పన్నులు చెల్లించాలన్నారు. పన్నులు చెల్లించడంలో ఏదైనా ఆన్‌లైన్ ప్రాబ్లం ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎస్‌బిసీ ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది సహకారంతో డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏడీటీవోఆర్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేందుకు ప్రొద్దుటూరులో ప్రారంభించామన్నారు. దీని వల్ల అధికారుల ప్రమే యం లేకుండా డ్రైవింగ్ సామర్థ్యం బట్టి లైసెన్సు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పద్ధతి వల్ల డ్రైవి ంగ్ బాగా చేసేవారు మాత్రమే లైసెన్సు పొందుతారు. పులివెందుల, కడప, బద్వేలులో కూడా త్వరలో ఈ పద్ధతి అమలు చేస్తామన్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా పర్మిట్లు, ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న 60 వాహనాలను గుర్తించి.. వాటి నుంచి రూ.12లక్షల పన్నులు వసూలు చేశామన్నారు. వాహనం నడిపే డ్రైవరుకు కంటి చూపు ఎంతో అవసరమని, వత్తిడి తగ్గించేందుకు డ్రైవర్లకు ఈ మాసోత్సవాల్లో కంటి పరీక్షలు నిర్వహించడం జరుగతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం అవాస్తవమన్నారు. మత్తుపానీయాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవర్ల భద్రతా దృష్ట్యా ఏటా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి... ఆటోలు, లారీలకు త్వరలో వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పులివెందుల మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు బీవీ ప్రసాద్, ఎంవీఐ జిల్లా స్క్వాడ్ వై.ప్రసాద్, డాక్టర్ బాలాంజనేయులు, ఆర్డీసీ ఎంఎఫ్ శ్రీకాంత్, ఆటో డ్రైవర్లు, స్కూలు బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.


ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభించిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి

ఒకే రోజు 16 గ్రంథాల ఆవిష్కరణ

కడప కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కడప ఐఎంఏ హాలులో ఫిబ్రవరి 8, 9వ తేదీలలో జరుగనున్న జిల్లా రచయితల మహాసభలలో ఒకేరోజు, ఒకే వేదికపై 16 గ్రంథాలను ఆవిష్కరించడం జిల్లా చరిత్రలో ఒక అపురూప సన్నివేశమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆ సభలలో తాను రచించిన శ్రీ శివభక్తేంద్రస్వామి, రామాయణ భారత భాగవతాల్లో కొన్ని పాత్రలు, అలాగే కల్లూరు బాల ఎల్లారెడ్డి రచించిన వల్లభాపురం (వల్లూరు) ఆణిముత్యాలు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి గండికోట విజయం, జార్జి జ్యోతికి చెందిన ఆగంతకుడు, మందల సుభాష్ చంద్రబోస్‌కు చెందిన సుమ శతకం, బుద్ధ శతకం, పసలోడి పద్యాలు, మశక త్యాగం, ప్రేమయోగం, డాక్టర్ తమ్మిశెట్టి వెంకటనారాయణ గ్రామిక కథలు, స్త్రీ చైతన్యం డాక్టర్ వి.సలీంబాషా గారి సమీచీనం (కవితాసంపుటి), ఏవీఎస్ రాజు గారి నటనాగమనం (అభినందన సంచిక), జిల్లా రచయితల సంఘం ప్రచురించిన విద్యార్థినుల కవితా సంపుటి, గద్వాల సోమన్న గారి హృదయరాగాలు (బాలగేయాలు) తదితర గ్రంథాలను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. మహాసభల ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి, తెలుగు భాషాభిమాని డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ప్రసిద్ధ అవధాని నరాల రామారెడ్డి, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సభలకు రానున్నట్లు వెల్లడించారు.

కార్పొరేషన్లకు కాసుల పంట



- కూటమి ప్రభుత్వం నిధుల కేటాయింపు
- 8 కార్పొరేషన్లకు రూ.26.84 కోట్ల రాయితీ
- 224 యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత పలు కార్పొరేషన్లకు కాసుల పంట పండుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. 8 కార్పొరేషన్లకు 2,170 యూనిట్లకు రూ.23.94 కోట్లు రాయితీని స్వయం ఉపాధి కింద రుణాలు అందించేందుకు ప్రభుత్వం జిల్లాకు కేటాయింపు చేసింది. యూనిట్ కాస్ట్‌లో 50శాతం సబ్సిడీని లబ్ధిదారులు పొందే అవకాశాలు ఉన్నాయి. మరో 50 శాతం బ్యాంకు నుంచి రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందేందుకు లబ్ధిదారులను వివిధ కార్పొరేషన్ అధికారులు ఎంపిక చేయనున్నారు. ఈ రుణాలు పొందేందుకు బీసీ, ఈబీసీ, కాపు కులాలకు చెందిన వారు అర్హులుగా అధికార యంత్రాంగం పేర్కొంటుంది. అదేవిధంగా చౌక ధరలకే ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో జిల్లాలో 73 జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.2.92 కోట్లు సబ్సిడీ జిల్లాకు విడుదల చేసింది. మరో రూ.2.92 కోట్లు బ్యాంకుల ద్వారా యూనిట్ల స్థాపనకు అధికార యంత్రాంగం ఔత్సాహికులైన యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. వెనుకబడిన తరగతుల ఉపకులాలకు సంబంధించి 1550 యూనిట్లకు రూ.15.50 కోట్ల రాయితీ విడుదల చేసింది. అదే విధంగా 32 జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు రూ.1.24కోట్ల రాయితీ కింద నిధులు కేటాయించారు. ఈబీసీ కార్పొరేషన్‌కు 74 యూనిట్లకు రూ.64లక్షల రాయితీ నిధులను కేఆయింపు చేశారు. 14 జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు రూ.56లక్షలు రాయితీ కేటాయించారు. కమ్మ కార్పొరేషన్‌కు 27 స్వయ ఉపాధి యూనిట్లకు గాను రూ.23.5లక్షల రాయితీ కేటాయించారు. నాలుగు జనరిక్ మందుల షాపుల స్థాపన కోసం రూ.16 లక్షలు రాయితీ ఇవ్వనున్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ పరిధిలో 17 మందికి స్వయం ఉపాధికి రూ.14.50 లక్షలు, జనరిక్ మందుల షాపుల స్థాపన కోసం మూడు యూనిట్లకు రూ.12లక్షలు రాయితీని కేటాయించారు. క్షత్రియ కార్పొరేషన్ పరిధిలో 16 మంది స్వయం ఉపాధికై రూ.14లక్షలు, జనరిక్ మందుల షాపుల స్థాపనకు మూడు యూనిట్లకు రూ.12లక్షల రాయితీ ఇవ్వనున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పరిధిలో 8 మందికి స్వయం ఉపాధి కోసం రూ.7లక్షలు, జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు ఒక యూనిట్‌కు రూ.4లక్షలు కేటాయించారు. కాపు కార్పొరేషన్ పరిధిలో 379 మందికి స్వయం ఉపాధికై రూ.6.36 కోట్ల రాయితీని కేటాయించారు.

త్వరలో అందుబాటులోకి వెబ్‌సైట్

బ్యాంకు అనుసంధాన రాయితీ రుణాలు పొందేందుకు త్వరలో వెబ్‌సైట్ అదుబాటులోకి రానుంది. వాస్తవంగా డిసెంబరు 8 నుంచి జనవరి 16 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరాం. అయితే సాంకేతిక కారణాల వల్ల వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దు. వెబ్‌సైట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత తదుపరి తేదీని ప్రకటిస్తాం.

-జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

నాలుగేళ్లుగా 'రోడ్డెక్కని' పనులు

- ప్రమాదాలకు నిలయంగా వేంపల్లె-రాయచోటి రహదారి
- నిర్వాసితులకు అందని పరిహారం




దొరిచెరువు వద్ద దుమ్ము రేగుతున్న రోడ్డు (ఇన్‌సర్ట్) మద్దిరేవుల సమీపంలో అధ్వానంగా రోడ్డు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి - మదనపల్లె నాలుగు లేన్ల రహదారి పనులు అర్థాంతరంగా ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం చాగలమర్రి నుంచి మదనపల్లె వరకు ఫోర్‌లైన్ రోడ్డు మంజూరు చేసింది. దీంతో వేంపల్లె నుంచి రాయచోటి వరకు పనులు ప్రారంభించారు. 2023 వరకు పనులు ముమ్మరంగా సాగాయి అందులో భాగంగా రాయచోటి -వేంపల్లె రహదారిలో దా దాపు 15 పైగా కల్వర్టుల పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు నిలిచిపోవడంతో వేంపల్లె నుంచి రాయచోటికి ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనమవుతోందని ప్రజలు వాపోతున్నారు పాయలోపల్లె గట్టు నుంచి కోనంపేట వరకు పెద్దఎత్తున దుమ్ము రేగుతుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో .రాయచోటి నుంచి వేంపల్లె చేరేందుకు 3 గంటల సమయం పడుతోందని ప్రజలు వాపోతున్నారు. బస్సులో ప్రయాణం చేసేవారి పరిస్థితి ఇలా ఉంటే ద్విచక్ర వాహనంలో వెళ్లేవారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ నాలుగేళ్లలో ఈ మార్గంలో సుమారు 10 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారు. లక్కిరెడ్డిపల్లె- రాయచోటి మధ్యలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వేంపల్లె, పాయలోపల్లె, చక్రాయపేట, ప్రాంతాల్లో కూడా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వర్షం వచ్చినపుడు ఈ మార్గంలో వెళ్లలేక పలువురు కడప-రాయచోటి మార్గం లో రాయచోటికి వెళుతున్నారు. దీంతో రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లెకు వచ్చేందుకు గంట సమయం పడుతోందని వాపోతున్నారు. లక్కిరెడ్డిపల్లె, చింతకుంటపల్లె, కోనంపేట, బండపల్లె, గొల్లపల్లె, రాయచోటిలో రోడ్డుకు ఇరువైపుల స్థలాలు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదని అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పనులు పూర్తి చేయక పోతే మరెన్నో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయడంతోపాటు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులే ఇవ్వలేదు



నేషనల్ హైవే పనులు ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు నాకు నోటీసులు ఇవ్వలేదు. మూడు మీటర్ల దాకా నా ఇల్లు రోడ్డుకు పోతోంది. ఇంతవరకు ఏ అధికారి మా ఇంటి వద్దకు రాలేదు. పరిహారం విషయం చెప్పలేదు..

- దర్బార్‌బాషా

ఇంతవరకు పరిహారం అందలేదు



రోడ్డు విస్తరణలో మూడు మీటర్ల దాకా స్థలం పోయింది. నాకు ఇంత వరకు పరిహారం అందలేదు. రెవెన్యూ అధికారులను అడిగితే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామంటున్నారు. పరిహారం చెల్లిస్తేనే ఇల్లు తొలగించేందుకు అంగీ కరిస్తా..

- సుబ్బరాజు

నివేదికలు పంపించాం

హైవే విస్తరణ పనులకు సంబంధించిన నిర్వాసితులు 80 నుంచి 100 మంది దాకా ఇప్పటికీ తమకు పరిహారం అందలేదంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక లు పంపించాం. ఇళ్లు, స్థలాలు, భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందేటట్లు చూస్తాం. రికార్డులు సక్రమంగా ఉంటే తప్పకుండా పరిహారం అందుతుంది

- శ్రీనివాసులు, తహసీల్దారు

ఏఎస్పీకి సన్మానం



ఏఎస్పీని సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజన్ అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేని దళిత సంఘాల నాయకులు మంగళవారం సన్మానించారు .అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దళితులపై దాడులను అధికారులు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు గాలిశెట్టి మనోహర్, పోలంరెడ్డి మల్లికార్జున, కాకి చంద్రమోహన్, మోడపోతుల వెంకట రమణ, లింగం సంజీవ్, కొరముట్ల వెంకటసుబ్బయ్య, జెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబుకు సన్మానం



ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న మురళీరాయల్

రాయచోటిటౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కువైత్‌లో తెలుగువారి సేవకుడిగా పేరు పొందిన జిలకర మురళీరాయల్ మంగళవారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను చర్చించడంతో పాటు భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం సిద్దవటం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ పట్టుబడిన వాహనాలను స్థానిక ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీ లతకు అప్పజెప్పామని తెలిపారు.

భూమి విషయంలో ఘర్షణ

లక్కిరెడ్డిపల్లె, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘర్షణకు దిగిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ,మండలంలోని మద్దిరేవుల పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వివేకానందరెడ్డి కుటుంబ సభ్యులు, బాబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని చెదరగొట్టారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుట, బహిరంగ స్థలంలో గొడవపడి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందుకు ఇరువురిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కూటమి హయాంలోనే సర్వతోముఖాభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. రాజంపేట టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూతపడే స్థితిలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ఏకంగా 17 వేల కోట్ల కేంద్ర ఆర్థిక సాయాన్ని తెప్పించి తిరిగి ఉక్కు పరిశ్రమకు జీవం పోసిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఉచిత ఇసుకను ప్రవేశపెట్టి ఇటు భవన నిర్మాణదారులకు, కార్మికులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని గ్రామీణ రోడ్లను పునర్నిర్మించారన్నారు. గత ప్రభుత్వం పేద ప్రజలకు నాసిరకం మద్యాన్ని తాగించి ప్రాణాలను బలిగొందన్నారు. అదే కూటమి ప్రభుత్వం మేలు రకమైన బ్రాండ్ మద్యాన్ని సరఫరా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మైనార్టీ నాయకులు అబూబకర్, గుల్జార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించం

- టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని



సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న పంతగాని

రైల్వేకోడూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. మంగళవారం భూ ఆక్రమణపై రైల్వే కోడూరు రూరల్ సీఐ పీ. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలం రాళ్లచెరువుపల్లెలో నాలుగు రోజుల క్రితం టీడీపీ సీనియర్ నాయకుడు చాపలమడుగు సూర్యప్రకాష్ నాయుడుకు సంబంధించిన భూమిని ఆక్రమించారని తెలిపారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని శాంతియుతంగా పరిష్కరించాలని పోలీసులను కోరామని తెలిపారు. నియోజకవర్గంలో భూ కబ్జాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కస్తూరి దినేష్‌నాయుడు, ఎస్‌కే గౌస్, అంకిపల్లె మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

సాయి లోకేశ్‌కు సన్మానం



సాయి లోకేశ్‌ను ఘనంగా సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరు, రూరల్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ అధ్యక్షుడుగా సాయి లోకేశ్‌ను అధిష్టానం మంగళవారం ప్రకటించడంతో రైల్వే కోడూరు బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు, రైల్వేకోడూరు మండల పార్టీ అధ్యక్షుడు సాయం శ్రీధర్ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిలోకేశ్ సేవలను అధిష్టానం గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ కార్య వర్గ సభ్యులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు తోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై విచారణ చేయాలి



రాష్ట్ర మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న వెంకటసుబ్బయ్య, బాలిశెట్టి హరిప్రసాద్

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో మండలంలో నిర్వహించిన భూముల రీసర్వేపై విచారణ చేయాలని పంచాయతిరాజ్ చాంబర్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మంగళవారం రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని శాఖరాజుపల్లి, మూలపల్లి, జంగాలపల్లి తదితర గ్రామాల్లో రీసర్వేలో భాగంగా చేసిన అక్రమాలపై విచారణ చేయించి రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, పుత్తరాజు పాల్గొన్నారు.

రహదారుల పునరుద్ధరణకు చర్యలు

రాయచోటిటౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధవరం నుంచి కమలామర్రి, గుంటిమడుగులకు వెళ్లే రహదారుల పునరుద్దరణకు అటవీశాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీపీ అన్నమయ్య జిల్లా నాయకుడు కసినేని మహేందర్‌నాయుడు తెలిపారు. మంగళవారం అటవీశాఖ అధికారులతో కలిసి మాధవరం గ్రామ టీడీపీ నాయకులు ఆ మార్గాన్ని పరిశీలించారు. రాయచోటి మండలం మాధవరం నుంచి కమలామర్రి, గుంటిమడుగులకు వెళ్లే రహదారులలను అటవీశాఖ అధికారులు మూసివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులను మాధవరం గ్రామ టీడీపీ నాయకులు మహేంద్రనాయుడు, సురేంద్ర, వెంకటగంగన్న, రాంమోహన్, గణేశ్, రఘు, రాము, వంశీ తదితరులు గుంటిమడుగు గ్రామ రైతులతో కలిసి సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించాలని వారు అధికారులను ఆదేశించారు. దీంతో అటవీశాఖ అధికారులు రహదారిని పరిశీలించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధితో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి కడప జిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని రామకృష్ణాపురంలో నివాసమున్న శివశంకర్‌రాజు, రామతులసి దంపతుల కుమారుడు మహీంద్రవర్మ(7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఈ విద్యార్థికి లక్షలు వెచ్చించి చికిత్స చేయించినా ఫలితం లేకపోగా, సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో దహన సంస్కారాల నిమిత్తం ఆయన చర్యలు తీసుకున్నారు. కాగా, వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాల తరఫున 11 వేల రూపాయలు అందజేశారు.

మదనగోపాలపురంలో పశువైద్య శిబిరం

రాజంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదన గోపాలపురంలో . ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 22 పశువులకు చికిత్స చేశారు. నట్టల నివారణ మందును తాగించారు. పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్ రావు, ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ కె.ప్రతాప్, కె.భాగ్యవతి మాట్లాడుతూ మదనగోపాలపురంలో 2020, అత్తిరాలలో 924 ఆవులకు, గేదెలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు తెలిపారు.

రామాపురం: మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీ. రాచపల్లి, కర్ణపువాండ్లపల్లెల్లో మంగళవారం డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 2646 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు.

పెనగలూరు : రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరి డాక్టర్ వేదవతి తెలిపారు. మంగళవారం తూర్పుపల్లె లో ఉచిత పశువైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు.

ముఖ్యమంత్రి కృషితో విశాఖ ఉక్కుకు భరోసా..

- రాజంపేట అసెంబ్లీ నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం



మీడియాతో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం లాంటిదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలి. ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తే.. విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తికి సామర్థ్యం ఉన్న విశాఖ స్టీల్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.10 వేల కోట్లయినా అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్ తదితరులు విన్నవించిన కొద్దిరోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరుకు సంబంధించిన బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున మొత్తం రూ.1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సాయం అందించిందన్నారు. నేడు స్టీల్ ప్లాంట్‌ను సంక్షోభం నుంచి ఆదుకునేందుకు చంద్రబాబు కృషికి ఫలితంగా రూ.11,440 కోట్ల సాయాన్ని కేంద్రం ప్రకటించిందన్నారు.

రీ సర్వేను పరిశీలించిన సబ్‌కలెక్టర్



రీ సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

ఓబులవారిపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నూకనపల్లెలో రీసర్వే పనులను రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిదియా దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందిని, రెవెన్యూశాఖ అధికారులను అడిగి రీసర్వే విధి విధానాలను తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూశాఖ సిబ్బందితో మాట్లాడుతూ రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావు, ఆర్ఐ రామ్మోహన్, మండల సర్వేయర్, సచివాలయ సిబ్బంది పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌తో చీడపీడల గుర్తింపు



యాప్ పని తీరును రైతులకు తెలియజేస్తున్న ఏవో నాగమణి

రామాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్టిసైడ్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్‌పీఎస్ఎస్) మొబైల్ యాప్ ద్వారా చీడపీడల పర్యవేక్షణ సులభవుతుందని మండల వ్యవసాయ అధికారిణి నాగమణి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా రైతు తన పంటలోని చీడపీడలను సులువుగా గుర్తించవచ్చునన్నారు. వీటి తీవ్రత ఆధారంగా ఎలాంటి మందులు వాడాలో మెసేజ్ వస్తుందని రైతులకు వివరించారు. అనంతరం రైతులతో మిరప, అనప పంటల్లోని చీడపీడలను ఈ యాప్ ద్వారా ఎలా గుర్తించాలో క్షేత్రస్థాయిలో చూపించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ సిబ్బంది లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట్రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించండి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు భరత్‌కుమార్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని గుంతకల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాను కోరారు. రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పిస్తే ఉద్యోగులకు, ఆసుపత్రులకు వెళ్లే పేదలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మరికొన్ని ప్యాసింజర్ రైళ్లను ఈ మార్గంలో ప్రవేశపెట్టాలని కోరారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల డెమో ప్యాసింజర్ రైళ్లకు పుల్లంపేట, అనంతరాజుపేట, శెట్టిగుంట రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. అనంతరం రాజంపేట రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వే సమస్యలపై డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

నందలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ శంకర్ నాయక్ తెలిపారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు, డ్రగ్స్ సైబర్ క్రైం తదితర నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. నాగేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



వీధి వ్యాపారులను హెచ్చరిస్తున్న ఏఎస్ఐ శంకర్‌నాయక్

నందలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్లవారు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్ఐ శంకర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన బస్టాండులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తినప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించాల న్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రామరాజు, హోంగార్డు మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి పరిమితమైన దివ్యాంగుల జాబితా తనిఖీ



పొందలూరులో దివ్యాంగులతో మాట్లాడుతున్న డాక్టర్ల బృందం

పెనగలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వంద శాతం వైకల్యం కలిగి 15 వేల రూపాయలు పింఛను తీసుకుంటున్న వారి ఇళ్లవద్దకు వెళ్లి ప్రత్యేక డాక్టర్ల బృందం మంగళవారం తనిఖీ చేసింది. పెనగలూరు ఎంపీడీవో విజయరావు అధ్యక్షతన డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కృష్ణచైతన్య మండల వ్యాప్తంగా ఉన్న పింఛనుదారులను నేరుగా కలుసుకున్నారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన వికలత్వం సర్టిఫికెట్లు పరిశీలించారు. పూర్తి వివరాలన్నింటిని ప్రభుత్వానికి తెలపనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

ఆడబిడ్డల చదువు కుటుంబానికి వెలుగు



గర్ల్స్ హైస్కూల్ బాలికలకు బహుమతులు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

రాయచోటిటౌన్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు చదువుకుంటే కుటుంబం బాగుపడుతుందని, ఆడబిడ్డల చదువు విషయంలో నిరక్ష్యం తగదని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకట్రమణ, ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ షమీం అంజుం అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మానవత సెక్రటరీ అంకం జయచంద్రరెడ్డి అధ్యక్షతన నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులు ఎల్. భవ్యశ్రీ, వీ. ప్రవళిక, సన కు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ వెంకట్రామి రెడ్డి, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, బీఏ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వంటగది తాళాల తొలగింపు

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల వంటగది తాళాలు ఇప్పించాలన్న పోలీసు బెటాలియన్ పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ విజ్ఞప్తి మేరకు ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలత మంగళవారం చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులు మంగళవారం ఆ తల్లిదండ్రుల విద్యాకమిటీ మెంబర్ల సమక్షంలో పంచ నామా వేసి వంటగది తాళాలు తొలగించి నూతన ఏజెన్సీ పుత్తా విజయకుమారికి వంటగది అప్పగించారు. హెచ్ఎం నాగమునిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్‌బాబు, వీఆర్వో శివశంకర్, విద్యాకమిటీ మెంబర్లు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మూడెకరాల్లో 30 రకాల మొక్కలు

- సేంద్రియ, సమీకృత వ్యవసాయంపై యువకుడి ఆసక్తి
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సన్నకారు యువరైతు
- సమీకృత వ్యవసాయంలో విరగ్గాసిన మునక్కాయలు
- ఏపుగా పెరుగుతున్న వివిధ రకాల మొక్కలు




నూతన వంగడాలు మామిడి, టెంకాయ మొక్కలు

పెద్దతిప్పసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఉన్న మక్కువతో తమకున్న నాలుగెకరాల పొలంలో మూడెకరాల్లో 30 రకాల పంటలను పండిస్తూ సమీకృత, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఓ సన్నకారు యువరైతు. పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెకు చెందిన యువ రైతు శ్రీనివాస్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్మీడియట్ చదువుతూ వ్యవసాయంపై మక్కువతో ఈ రంగంలోకి దిగాడు. అతడికి ఉన్న నాలుగెకరాల పొలంలో మూడెకరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాడు. అర ఎకరా భూమిలో మునగ సాగు చేయాలని భావించి దక్షిణాఫ్రికా నుంచి రూ.45 వేలు వెచ్చించి ము నగ గింజలను తెప్పించి నారు పోసి సంవత్సరం క్రితం నాటించాడు. ఆ మునగ పంట ఇప్పుడు మంచి దిగుబడి ఇస్తోంది.

సేంద్రియ పద్ధతుల్లో 30 రకాల చెట్ల పెంపకం

సేంద్రియ పద్ధతులను అవలంభించి 2 ఎకరాల్లో రాజమండ్రి నుంచి టెంకాయ చెట్లు గంగాబోండ, రామ్‌గంగా, చెనంగి, రెడ్‌బోండా, కోడ్ కోకోనట్ ట్రీ, పర్పామెడ్‌ట్రీ, మోడ్‌గ్రీన్, మోడ్ ఆరెంజ్, మాలయాన్‌గ్రీన్, టీఎక్స్‌డి, కూట్టానట్టై, మాండ్యా అనే వివిధ రకాల టెంకాయచెట్లు 300 పైగా సాగు చేశాడు. పండ్ల చెట్లు అయిన గ్రీన్ అవకాడో, బ్లాక్ అవకాడో, వాటర్ ఆపిల్, బ్లాక్ సపోట, ఆరెంజ్, అంజీర, బిర్యానీ ఆకు, యాలక్కీ, బ్లాక్ మిరియాలు, వెనీలా, వంటి పండ్ల సాగు, మహాగని చెట్లు 500 మొక్కలకు పైనే సాగు చేశాడు.

నిమ్మ, దానిమ్మ, మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. టెంకాయ చెట్లు మూడు నుంచి నాలుగు లీటర్ల కొబ్బరి నీళ్లు కలిగి ఉంటాయని తనకు దక్షిణాఫ్రికాలో తెలిపారని, అందుకే అక్కడి నుంచి తెప్పించి నాటినట్లు తెలిపారు. టెంకాయ చెట్లు రెండు మూడేళ్లలో కాపుకు వస్తాయని ఆ రైతు తెలిపాడు. 60కి పైగా టేకు మొక్కలు కూడా పెంచుతున్నాడు. ఇలా ఎక్కడా లేని రీతిలో అత్యధిక మొక్కలను పొలంలో ఆ రైతు చక్కగా సాగు చేశాడు. ముఖ్యంగా ఈ పంటలకు దిబ్బ ఎరువులు, వివిధ రకాల ఆకులతో తయారు చేయబడిన ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నాడు. వివిధ రకాల ఆకులను కోసి పొలంలోనే ఓ పెద్ద గొయ్యి తీసి వాటిని కప్పి పెట్టి వాటిని బాగా కుళ్లబెట్టిన తరువాత దానిని ఎరువుగా వినియోగిస్తున్నాడు. దాదాపు ఆ యువరైతు ఇప్పటికే రూ.7 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి వివిధ రకాల మొక్కలను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి సమీకృత వ్యవసాయం విధానంతో ఇక్కడ సాగు చేస్తుండడం విశేషం. మూడు ఎకరాల పొలంలో ఇన్ని రకాల చెట్లు, పంటలు సాగు చేస్తుండడం ఈ ప్రాంతంలో విశేషంగా చెప్పుకుంటున్నారు. సమీకృత, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇలాంటి యువ రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తే సేంద్రియ వ్యవసాయం మరింత విస్తృతంగా ఇంకా పలువురు రైతులు చేపట్టేందుకు అవకాశాలు మెరుగవుతాయి.



విరగ్గాసిన మునక్కాయలు



ఏపుగా పెరుగుతున్న మహాగని మొక్కలు



అవకాడో



యువ రైతు శ్రీనివాస్

గేదెలు, ఎద్దుల అక్రమ తరలింపు

- వాహనాన్ని అడ్డుకున్న టీడీపీ, బీజేపీ నాయకులు
- 28 గేదెలు, ఎద్దులు స్వాధీనం
- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



ఒకే లారీలో ఆవులు, గేదెలను కుక్కి తరలిస్తున్న దృశ్యం

సుండుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గేదెలు, ఎద్దులను తరలిస్తున్న వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై మంగళవారం కూటమి నాయకులు, స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీలో ఉన్న 19 గేదెలు, 9 ఎద్దులను కిందికి దింపి పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలోనికి తరలించారు.

గుంటూరు జిల్లా వినుకొండ నుంచి పీలేరు నియోజకవర్గంలోని కలికిరి మండలానికి వాటిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, కోర్టు అనుమతితో ఆయా పశువులను గోశాలకు తరలిస్తామని వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, టీడీపీ నాయకులు సోమిశెట్టి మస్తాన్‌బాబు, రామరాజు, గంటల సిద్దయ్య, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గేదెల అపహరణ

మండలంలో మడితాడు గ్రామ పంచాయతీ నడింతురకపల్లికి చెందిన సాబ్‌జాన్, మడితాడుకు చెందిన జయపాల్‌కు చెందిన రెండు గేదెలు సోమవారం అర్ధరాత్రి అపహరణకు గురైనట్లు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటి విలువ ఒక్కొక్కటి సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

నిర్మలగిరి కాలనీలో వరుస చోరీలు

సిద్దవటం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారిలోని కిరాణాషాపు, నిర్మలగిరి కాలనీలోని గృహంలో సోమవారం రాత్రి దొంగలు నగదు అపహరించుకు వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి పక్కనే ఉన్న తన కుమారుడు ఇంటికి వెళ్లానని మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న పొదుపు మొత్తం రూ.8 వేలు అపహరించుకు వెళ్లారని లక్షుమ్మ తెలిపింది. అలాగే దుకాణం తాళాలు తొలగించి 4 వేల రూపాయలు, కొన్ని వస్తువులు తీసుకెళ్లారని కిరాణాషాపు యజమాని నరసయ్య తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.



బీరువా పగులగొట్టిన దొంగలు

మదనపల్లె బస్టాండులో వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ వ్యాధితో మదనపల్లెలోని బెంగళూరు బస్టాండ్‌లో వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు కదిరి పట్టణం నానా దర్గా వీధికి చెందిన సాబ్‌జాన్ కుమారుడు సాదిక్‌వల్లి పదిరోజుల క్రితం మదనపల్లె పట్టణంలోని దక్నిపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి ఉరుసు సందర్భంగా బయటకు వచ్చి బెంగళూరు బస్టాండ్‌లో మూర్ఛ వ్యాధితో కుప్పకూలి అక్కడే మృతి చెందాడన్నారు. టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికిలోని మార్చురికి తరలించారు. మృతుడికి ముగ్గుకు కుమార్తెలు ఉన్నారని తెలిపారు.

పటిష్టంగా ఎంఎస్‌ఎంఈల సర్వే

ప్రతి ఎంఎస్‌ఎంఈ 'ఉద్యం' రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలి : కలెక్టర్ శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్


రాయచోటి (కలెక్టరేట్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంఎస్‌ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంఎస్‌ఎంఈల సర్వే అంశంపై జిల్లా పరిశ్రమల శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంఎస్‌ఎంఈ సర్వే-2024ను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని, అందువల్ల అన్ని పరిశ్రమలు, సేవా రంగాలు, వ్యాపార సంస్థలు ఉద్యం రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలని తెలిపారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు పరిశ్రమలశాఖ అధికారులు, కమర్షియల్ ట్యాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణారావు, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్, వయోజన విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన అక్షర వెలుగులు, మార్గదర్శినిలు, వాల్ స్టిక్కర్ క్యాలెండర్లు అటెండెన్స్ రిజిస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది అన్నమయ్య జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధించి రాష్ట్రంలో ఒక రోల్ మోడల్‌లా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, రాయచోటిలోని డైట్‌లో అన్నమయ్య జిల్లాలోని ఎంపీడీవోలు, ఏపీఎంలకు ఉల్లాస్ కార్యక్రమంపైన జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగిందని, జిల్లాలో అభ్యాసకులుగా నమోదైన 13,767 మందిని అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఎంపీడీవోలు, ఏపీఎంలు శిక్షణ పొందారని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరాజపురంలో చోరీ

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో దొంగలు పడి నగలు అపహరించుకు వెళ్లినట్లు మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ నల్లరాళ్లమిట్టకు చెందిన మురళీ మోహన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నవీన్‌బాబు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి ఊరికి వెళ్లిన బాధితుడు మంగళవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉండడం కనిపించిందని పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న సుమారు 80 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దొంగలు పగలగొట్టిన బీరువా

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామానికి చెందిన గంగయ్య (37) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతను మద్యానికి బానిస కావడంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవని కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంట్లో నుంచి వెళ్లిన అతను మంగళవారం ఆటోలో మృతి చెంది కనిపించాడు. ఈ మేరకు గంగయ్య తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్



సమావేశంలో మాట్లాడుతున్న రజాక్

మదనపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సంక్షేమానికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని కడప జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజాక్ తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో మదనపల్లెలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబానికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, రాయితీ, అభివృద్ధి పథకాలను వివరించారు.

కొత్తగా ఉద్యోగ విరమణ చెందిన సైనికులకు ఐడెంటిటీ కార్డు, కుటుంబ పెద్ద మరణిస్తే, భార్యకు, పిల్లలకు ఐడెంటిటీ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలు మారిన నేపథ్యంలో కార్డులో కరెక్షన్లు చేసి కార్డులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. మాజీ సైనికులు మరణిస్తే దహనక్రియలకు క్యాంటిన్ ద్వారా, జిల్లా వెల్ఫేర్ ద్వారా ఎంత మొత్తం వస్తుందో, దాన్ని ఎలా తీసుకోవాలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ పొందడం, హాస్పిటల్‌లో చేరితే వైద్యం పొందడానికి చేసుకునే దరఖాస్తు, తదితర అంశాలను వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, మరో వైపు వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో మాజీ లెఫ్టినెంట్ కర్నల్ బాషా, వైస్ ప్రెసిడెంట్ సి.లక్ష్మీనారాయణ, వెంకటస్వామి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, సభ్యులు బీమారెడ్డి, సురేష్‌బాబు, పి.వి.రెడ్డి, సత్యనారాయణ, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీలో వసూళ్లపై విచారణ



కంబాలపల్లెలో విచారిస్తున్న డీటీ వెంకటరెడ్డి

బి.కొత్తకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ఏజన్సీ నుంచి వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సిబ్బంది చేతివాటంపై సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్‌పల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో డెలివరీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేలింది.

లబ్ధిదారులు ఉచితగ్యాస్ పథకం కింద చెల్లించాల్సిన రూ.839కి అదనంగా రూ.80 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా జాయింట్ కలెక్టర్, జిల్లా సివిల్‌సప్లైస్ అధికారి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె సవిల్‌సప్లైస్ డీటీ బి.కొత్తకోట మండలంలో వినియోగదారులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం స్థానిక గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌లతో సమావేశమయ్యారు. అదనపు వసూళ్లకు పాల్పడి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లుపొడవద్దని నిర్దేశించిన ధరను మాత్రమే వసూలు చేయాలని ఆదేశించారు. ఇకపై అదనపు వసూళ్లకు పాల్పడినట్లు రుజువైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి పరిశీలన

- కబ్జా భూమిలో బోర్డు నాటిన అధికారులు
- స్టేటస్‌కో ఉందని తిరిగి తొలగింపు

బి.కొత్తకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టు రెవెన్యూ పరిధిలో భూకబ్జా జరిగిందంటూ వెళ్లిన ఫిర్యాదుపై మంగళవారం బి.కొత్తకోట రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ కథనం మేరకు వివరాల్లోకెళితే... గ్రామంలోని సర్వే నెంబరు 1117లో 4.53 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెడ్డెప్ప కబ్జా చేసి, తన స్వాధీనంలో ఉంచుకున్నాడని ఆరోపించారు.

దానికి విముక్తి కల్పిస్తే ప్రభుత్వ భవనాల నిర్మాణానికో, పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడానికో ఉపయోగ పడుతుందని అదే గ్రామానికి చెందిన నరసింహులు కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ ఫిర్యాదుపై విచారణ చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. మంగళవారం తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వో రాంప్రసాద్ గట్టు గ్రామానికి వెళ్లి ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టడానికి ప్రయత్నించారు. ఇంతలో భూమి ఆక్రమించినట్టు చెబుతున్న వ్యక్తి అక్కడికి వచ్చి, ఆ భూమిని అనాదిగా సాగు చేసుకుంటున్నామని, దీనిపై స్టేటస్‌కో ఉన్నట్టు కోర్టు ఆదేశాల ప్రతిని చూపాడు. దీంతో బోర్డును తొలగించారు. ఫిర్యాదు వచ్చిన భూమిపై కోర్టు యథాతథస్థితిని కొనసాగించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ

- మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పతకాల పంట
- జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు




రోప్ స్కిప్పింగ్ ఆడుతున్న విద్యార్థులు



రోప్ స్కిప్పింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

రైల్వేకోడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ (తాడుఆట)లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. రైల్వేకోడూరుకు చెందిన జోగినేని వైష్ణవి అండర్-14, 17, 19 విభాగాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించింది. నితీషకుమార్‌రాజు అండర్-14, 17, 19 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. జోషిత అండర్-19 విభాగంలో బ్రాంజ్, సిల్వర్ పతకాలు సాధించింది. సుమ అండర్-17, 19 విభాగాల్లో బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విద్యార్థులకు ప్రతి రోజూ సాయంత్రం వేళలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జోషిత, వైష్ణవి, నితీష్‌కుమార్ రాజు, సుమ త్వరలో లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతున్నారు.


జాతీయ స్థాయిలో విజయం సాధిస్తా



జాతీయ స్థాయి క్రీడల్లో విజయం సాధిస్తాను. గ్రామీణ స్థాయి నుంచి పోటీల్లో పాల్గొంటూ మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. మళ్లీ రాష్ట్ర స్థాయిలో పాల్గొని బంగారు పతకాన్ని సాధిస్తాను. ఇప్పటికే చాలా మెడల్స్ సాధించాను. ఇంకా సాధిస్తాను.

-జోగినేని వైష్ణవి

ప్రత్యేక శిక్షణ



రోప్ స్కిప్పింగ్ పోటీలకు వెళ్లే విద్యార్థులకు మంచి తీర్పుదు ఇస్తున్నాము. ఉదయం లేవగానే విద్యార్థులు వారి ఇళ్లలోనే ప్రాక్టీసు చేసి స్కూలుకు వస్తారు. క్లాసులు పూర్తి కాగానే మళ్లీ రోప్ స్కిప్పింగ్ లో మెలకువలు నేర్పిస్తాము. విద్యార్థులు ఈ క్రీడలో బాగా రాణించాలనే ఉద్దేశంతో స్పీడు పెంచేటట్లు శిక్షణ ఇస్తున్నాము.

-కట్టా వెంకటేష్, కోచ్

పాడి రైతుకు వెన్నుదన్నుగా...

● పశుసంపదపై ప్రత్యేక దృష్టి సారించిన కూటమి సర్కార్
● నెలాఖరు వరకు ప్రత్యేక పశు ఆరోగ్య శిబిరాలు
● రూ.1.020 కోట్ల విలువైన మందులు సరఫరా



రాచాయపేటలో మేకలకు నట్టల నివారణ మందులను తాపిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ, పక్కన డీడీ రమణయ్య

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి రంగం, పశుసంపదపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా పశుగ్రాస పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చింది. పశువులు, జీవాలకు మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజాప్రయోజన పనులు చేపట్టేందుకు పల్లె పండుగ పేరుతో సిమెంటు రహదారులు, ప్రహరీల నిర్మాణంతోపాటు పాడి పశువులకు ఉపయోగపడేలా గోకుల షెడ్ల నిర్మాణాలను చేపట్టింది. దీంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశుపోషణకు అవసరమైన మౌళిక వసతులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయడంతో పాడి రైతుల్లో సంబరాలు మిన్నంటాయి. తాజాగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం, వ్యాధి నిరోధక టీకాలు, పశుసంబంధిత వ్యాధులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

జిల్లా పశుసంపద

జిల్లాలో 1.80 లక్షల మంది ప్రత్యక్షంగా పాడి కలిగిన రైతులు ఉన్నారు. 3.99 లక్షల గేదెలు, 44 వేల ఆవులు, ఎద్దులు, 3.80 లక్షల మేకలు, 9.20 లక్షల గొర్రెలు ఉన్నాయి. జిల్లాలో 17 ప్రాంతీయ పశువైద్యశాలలో 78 పశువైద్యశాలలు, 224 రైతు సేవా కేంద్రాల పరిధిలో పశువైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద పశువులకు కూడా ఈసారి నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. పశుఆరోగ్య శిబిరాల్లో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందు పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు చేపట్టారు. జిల్లాలో ప్రతి మండలానికి 2 నుంచి 3 బృందాలు ఈనెల చివరి వరకు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలు అందిస్తున్నారు.

సమృద్ధిగా మందులు సరఫరా

జిల్లాలో ప్రత్యేక పశుఆరోగ్య శిబిరాల కోసం రూ.1.20 కోట్ల రూపాయల విలువగల నట్టల నివారణ మందులు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యాయి. వీటిలో పెద్దపశువుల కోసం రూ.67 లక్షలు, దూడల కోసం రూ.5 లక్షలు, మేకలు, గొర్రెల కోసం రూ.30 లక్షలు విలువచేసే మందులు కేటాయించారు. వీటిని అన్ని కేంద్రాలకు చేరవేసినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ సి.శారదమ్మ తెలిపారు. వీటితోపాటు జిల్లాకు రెగ్యులర్‌గా రావాల్సిన క్వార్టర్లీ వాటా కింద రూ.1.30 కోట్ల రూపాయల మందులు కూడా సరఫరా అయ్యాయని, అవసరమైతే వీటిలో నుంచి కూడా వైద్యశిబిరాలకు చికిత్స కోసం మందులను వినియోగిస్తామని వివరించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగా దూడల ప్రదర్శనకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో నిర్వహిస్తున్న 20 క్యాంపుల్లో ఒక్కో క్యాంప్‌కు రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.2.40 లక్షలు విడుదల చేశారని తెలిపారు. ఈ శిబిరాల్లో దూడలకు నట్టల నివారణ మందులు, విటమిన్-ఎ, టీకాలు, సమృద్ధిగా దూడల పెరుగుదలకు లివర్‌టానిక్స్, కాల్షియం టానిక్, మట్టి తినకుండా సాల్ట్‌లిక్స్‌తోపాటు రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రోత్సాహక బహుతులను అందిస్తున్నట్లు వివరించారు. గోడపత్రాలు, అవగాహన సదస్సుల ద్వారా ప్రచారం చేస్తూ అందిస్తున్న ఈ సేవలను పాడి రైతులు, పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రారంభమైన పీజీ పరీక్షలు

● తొలిరోజు 96 శాతం మంది హాజరు


పరీక్షలను పరిశీలిస్తున్నవైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డి, తదితరులు

కడప ఎడ్యుకేషన్ జనవరి 21, (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం వైవీయూ ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయంలో జరుగుతున్న పరీక్షలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి క్రిష్ణారావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వాహణపై సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయినిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ తొలిరోజు 560 మంది విద్యార్థులకు 540 (96 శాతం) మంది హాజరయ్యారన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ మునికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్...



కడప ఎడ్యుకేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల అర్హత పత్రాల పరిశీలన సీట్ల కేటాయింపు జరిగింది. కౌన్సెలింగ్ కేంద్రాన్ని వైస్ చానల్సర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి, పరీక్షల నిర్వహణాధికారి కేఎస్‌వీ క్రిష్ణారావ్ సందర్శించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసుకున్న వారికి లేటరల్ ఎంట్రీ విధానంలో యేడాది పీజీ డిగ్రీకి తొలిసారిగా ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ వి.రామకృష్ణ, గణేష్‌నాయక్, మునికుమారి సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ ప్రమాదంలో మరో వ్యక్తి మృతి


అరుణ్‌కుమార్ మృతదేహం

కడప క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురంలోని ఆచారి కాలనీలో సోమవారం సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బిక్కిరి అరుణకుమార్ (39) మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. అరుణ్‌కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబసభ్యులు బోరున విలపించారు.

ముష్టి చెక్క, బెల్లం తిని మహిళ మృతి

సుండుపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముష్టి చెక్క, బెల్లం తిని మండలంలోని తాటిగుంటపల్లెకు చెందిన తుమ్మలరాజు సులోచన మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈమె ఒక్కోసారి ఇంట్లో నుంచి వెళ్లిపోతూ ఉంటుందని, అలాంటపుడు భర్త ఇంటికి పిలుచుకుని వచ్చేవాడని తెలిపారు. సోమవారం సాయంత్రం అస్వస్థతకు గురైన ఆమె తాను ముష్టి చెక్క తిన్నట్లు భర్త కుమార్‌రెడ్డికి చెప్పడంతో వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, పరిస్థితి విషయంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చాపాడు జనవరి 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బసిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రతాపరెడ్డి అనే ఉపాధ్యాయుడిని డీఈవో మీనాక్షి మంగళవారం సస్పెండ్ చేసినట్లు ఎంఈవో వంశీకృష్ణ తెలిపారు. ప్రతాపరెడ్డి విధులకు సక్రమంగా హాజరు కాకుండా, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనందున సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఆదాయపు పన్నుపై వడ్డీ మినహాయింపు

● ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్



మాట్లాడుతున్న ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు

ప్రొద్దుటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను వడ్డీ మినహాయింపుతో పాటు జరిమానాలు, శిక్షలను మాఫీ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివాద్ సె విశ్వాస్ పథకాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో వివిధ వాణిజ్య సంఘాలు, ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఘాలకు వివాద్ సె విశ్వాస్ పథకం అడ్వాన్స్ టాక్స్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు రేంజ్ ఆదాయపు పన్ను అడిషనల్ కమిషనర్ శరత్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివాద్ సె విశ్వాస్ పథకం తీసుకువచ్చారన్నారు. ఈ పథకం ద్వారా అప్పీల్ దాఖలు చేసిన పన్ను చెల్లింపుదారులు జనవరి 31 లోపు దరఖాస్తు చేయాలన్నారు. ఈ పథకం వలన ఆదాయపు పన్నుకు వడ్డీ మిన హాయింపుతో పాటు పెనాల్టీలు, శిక్షలు మాఫీ అవుతాయన్నారు. కేవలం పన్ను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. అడ్వాన్స్ టాక్స్ పన్నుచెల్లింపు దారులు వారి వార్షిక ఆదాయంపై చెల్లించాల్సిన ఆదాయపు పన్ను నాలుగు విడతల్లో చెల్లించే అవకాశం కల్పించిందన్నారు. సదస్సులో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శశివర్ధన్, టాక్స్ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షుడు మేడా చంద్రశేఖర్, కడప చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సాదుగోపాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి


ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభించిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసేటప్పుడు మనసు, శరీరం ఒకే విధం గా పనిచేయాలని.. ఇతర ఆలోచనలతో వాహనాలు నడపరాదని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనరు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పులివెందుల ఆర్టీవో కార్యాలయంలో ఆటోడ్రైవర్లు, ప్రైవేటు బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈనెల 31లోపు పన్ను లు చెల్లించకపోతే 30 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారుల కంటపడితే 200 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు గడువు ముందే పన్నులు చెల్లించాలన్నారు. పన్నులు చెల్లించడంలో ఏదైనా ఆన్‌లైన్ ప్రాబ్లం ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది సహకారంతో డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏడీటీవోఆర్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేందుకు ప్రొద్దుటూరులో ప్రారంభించామన్నారు. దీని వల్ల అధికారుల ప్రమే యం లేకుండా డ్రైవింగ్ సామర్థ్యం బట్టి లైసెన్సు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పద్ధతి వల్ల డ్రైవి ంగ్ బాగా చేసేవారు మాత్రమే లైసెన్సు పొందుతారు. పులివెందుల, కడప, బద్వేలులో కూడా త్వరలో ఈ పద్ధతి అమలు చేస్తామన్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా పర్మిట్లు, ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న 60 వాహనాలను గుర్తించి.. వాటి నుంచి రూ.12లక్షల పన్నులు వసూలు చేశామన్నారు. వాహనం నడిపే డ్రైవరుకు కంటి చూపు ఎంతో అవసరమని, వత్తిడి తగ్గించేందుకు డ్రైవర్లకు ఈ మాసోత్సవాల్లో కంటి పరీక్షలు నిర్వహించడం జరుగతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం అవాస్తవమన్నారు. మత్తుపానీయాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవర్ల భద్రతా దృష్ట్యా ఏటా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి... ఆటోలు, లారీలకు త్వరలో వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పులివెందుల మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టరు బీవీ ప్రసాద్, ఎంవీఐ జిల్లా స్క్వాడ్ వై.ప్రసాద్, డాక్టర్ బాలాంజనేయులు, ఆర్టీసీ ఎంఎఫ్ శ్రీకాంత్, ఆటో డ్రైవర్లు, స్కూలు బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యాపారి మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

పుంగనూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి పుంగనూరు సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మంగళవారం అన్నమయ్య జిల్లాకు చెందిన బొంతల వ్యాపారి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన రంగయ్య కుమారుడు శ్రీనివాసులు(35) కొద్దిరోజుల క్రితం బొంతల వ్యాపారం కోసం పుంగనూరుకు వచ్చి నక్కబండ వద్ద ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వాహనాల స్కామ్‌తో సంబంధం లేదు'

మదనపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనాల స్కామ్‌తో తమకు సంబంధం లేదని మదనపల్లె బైపాస్‌రోడ్డులోని సయ్యద్ కార్స్ అధినేత ఎస్.మౌలా ఒక ప్రకటనలో తెలిపారు. యజమానుల నుంచి కార్లను సక్రమమైన మార్గంలో కొనగోలు చేసిన వాటినే కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. మదనపల్లె కేంద్రంగా సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో తీసుకెళ్లి, బయట తాకట్టు పెడుతున్న వ్యవహారాల్లో తమకు సంబంధం లేదని మౌలా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన సబ్‌కలెక్టర్

ఓబులవారిపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నూకనపల్లెలో రీసర్వే పనులను రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందిని, రెవెన్యూశాఖ అధికారులను అడిగి రీసర్వే విధి విధానాలను తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూశాఖ సిబ్బందితో మాట్లాడుతూ రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, ఆర్‌ఐ రామ్మోహన్, మండల సర్వేయర్, సచివాలయ సిబ్బంది పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే రోజు 16 గ్రంథాల ఆవిష్కరణ

కడప కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కడప ఐఎంఏ హాలులో ఫిబ్రవరి 8, 9వ తేదీలలో జరుగనున్న జిల్లా రచయితల మహాసభలలో ఒకేరోజు, ఒకే వేదికపై 16 గ్రంథాలను ఆవిష్కరించడం జిల్లా చరిత్రలో ఒక అపురూప సన్నివేశమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆ సభలలో తాను రచించిన శ్రీ శివభక్తేంద్రస్వామి, రామాయణ భారత భాగవతాల్లో కొన్ని పాత్రలు, అలాగే కల్లూరు బాల ఎల్లారెడ్డి రచించిన వల్లభాపురం (వల్లూరు) ఆణిముత్యాలు, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి గండికోట విజయం, జార్జి జ్యోతికి చెందిన ఆగంతకుడు, మందల సుభాష్ చంద్రబోస్‌కు చెందిన సుమ శతకం, బుద్ధ శతకం, పసలోడి పద్యాలు, మశక త్యాగం, ప్రేమయోగం, డాక్టర్ తమ్మిశెట్టి వెంకటనారాయణ శ్రామిక కథలు, స్త్రీ చైతన్యం డాక్టర్ వి.సలీంబాషా గారి సమీచీనం (కవితాసంపుటి), ఏవీఎస్ రాజు గారి నటనాగమనం (అభినందన సంచిక), జిల్లా రచయితల సంఘం ప్రచురించిన విద్యార్థినుల కవితా సంపుటి, గద్వాల సోమన్న గారి హృదయరాగాలు (బాలగేయాలు) తదితర గ్రంథాలను ఆవిష్కరించడం జరగుతుందన్నారు. మహాసభల ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి, తెలుగు భాషాభిమాని డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, ప్రసిద్ధ అవధాని నరాల రామారెడ్డి, ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సభలకు రానున్నట్లు వెల్లడించారు.

కార్పొరేషన్లకు కాసుల పంట



● కూటమి ప్రభుత్వం నిధుల కేటాయింపు
● 8 కార్పొరేషన్లకు రూ.26.84 కోట్ల రాయితీ
● 224 యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తర్వాత పలు కార్పొరేషన్లకు కాసుల పంట పండుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. 8 కార్పొరేషన్లకు 2,170 యూనిట్లకు రూ.23.94 కోట్లు రాయితీని స్వయం ఉపాధి కింద రుణాలు అందించేందుకు ప్రభుత్వం జిల్లాకు కేటాయింపు చేసింది. యూనిట్ కాస్ట్‌లో 50శాతం సబ్సిడీని లబ్ధిదారులు పొందే అవకాశలు ఉన్నాయి. మరో 50 శాతం బ్యాంకు నుంచి రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందేందుకు లబ్ధిదారులను వివిధ కార్పొరేషన్ అధికారులు ఎంపిక చేయనున్నారు. ఈ రుణాలు పొందేందుకు బీసీ, ఈబీసీ, కాపు కులాలకు చెందిన వారు అర్హులుగా అధికార యంత్రాంగం పేర్కొంటుంది. అదేవిధంగా చౌక ధరలకే ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో జిల్లాలో 73 జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.2.92 కోట్లు సబ్సిడీ జిల్లాకు విడుదల చేసింది. మరో రూ.2.92 కోట్లు బ్యాంకుల ద్వారా యూనిట్ల స్థాపనకు అధికార యంత్రాంగం ఔత్సాహికులైన యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. వెనుకబడిన తరగతుల ఉపకులాలకు సంబంధించి 1550 యూనిట్లకు రూ.15.50 కోట్ల రాయితీ విడుదల చేసింది. అదేవిధంగా 32 జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు రూ.1.24కోట్ల రాయితీ కింద నిధులు కేటాయించారు. ఈబీసీ కార్పొరేషన్‌కు 74 యూనిట్లకు రూ.64లక్షల రాయితీ నిధులను కేఆయింపు చేశారు. 14 జనరిక్ మందుల షాపు ఏర్పాటుకు రూ.56లక్షలు రాయితీ కేటాయించారు. కమ్మ కార్పొరేషన్‌కు 27 స్వయ ఉపాధి యూనిట్లకు గాను రూ.23.5లక్షల రాయితీ కేటాయించారు. నాలుగు జనరిక్ మందుల షాపుల స్థాపన కోసం రూ.16 లక్షలు రాయితీ ఇవ్వనున్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ పరిధిలో 17 మందికి స్వయం ఉపాధికి రూ.14.50 లక్షలు, జనరిక్ మందుల షాపుల స్థాపన కోసం మూడు యూనిట్లకు రూ.12లక్షలు రాయితీని కేటాయించారు. క్షత్రియ కార్పొరేషన్ పరిధిలో 16 మంది స్వయం ఉపాధికై రూ.14లక్షలు, జనరిక్ మందుల షాపుల స్థాపనకు మూడు యూనిట్లకు రూ.12లక్షల రాయితీ ఇవ్వనున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పరిధిలో 8 మందికి స్వయం ఉపాధి కోసం రూ.7లక్షలు, జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు ఒక యూనిట్‌కు రూ.4లక్షలు కేటాయించారు. కాపు కార్పొరేషన్ పరిధిలో 379 మందికి స్వయం ఉపాధికై రూ.6.36 కోట్ల రాయితీని కేటాయించారు.

త్వరలో అందుబాటులోకి వెబ్‌సైట్

బ్యాంకు అనుసంధాన రాయితీ రుణాలు పొందేందుకు త్వరలో వెబ్‌సైట్ అదుబాటులోకి రానుంది. వాస్తవంగా డిసెంబరు 8 నుంచి జనవరి 16 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరాం. అయితే సాంకేతిక కారణాల వల్ల వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దు. వెబ్‌సైట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత తదుపరి తేదీని ప్రకటిస్తాం.

-జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేద్దాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్



సాయిలోకేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రసాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. మంగళవారం రాష్ట్ర నేతలు బ్రహ్మం, అంకాలరెడ్డి ఆధ్వర్యంలో సాయిలోకేష్‌ను జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అనంతరం ఆయనను ఘనంగా గజమాల వేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్, నాయకులు భవానీ, భగవాన్, పాల్గొన్నారు.

నిధులు వెనక్కి పంపడంపై చర్యలు తీసుకోండి

మున్సిపల్ ఆర్డీకి వినతి

మదనపల్లె, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ జి.సహజీవన్ బాబు, మున్సిపల్ ఆర్డీకి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో 2022 నుంచి 2024 వరకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.7.70కోట్లు వస్తే, నామమాత్రంగా రూ.77లక్షలు వినియోగించుకుని ప్రభుత్వానికి వెనక్కి పంపినట్లు ఆయన ఆరోపించారు. టైడ్, అన్‌టైడ్ విభాగాల కింద వచ్చే ఈనిధులను రోడ్లు, కాల్వల నిర్మాణం, తాగునీటి బోర్లు, శానిటేషన్‌కు ఉపయోగించు కోవచ్చన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులున్నా బోర్లు వేయడానికి మున్సిపల్ సాధారణ నిధులు ఉపయోగించడం ఏమిటని ఆయన ఫిర్యాదులో ప్రశ్నించారు. పట్టణంలో కొత్తగా గృహాలు నిర్మించే వారి నుంచి ఇంటిప్లాన్ జారీ సమయంలో ఇంకుడు గుంత పేరుతో వెయ్యి రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపించారు. ఆ నిధులు కూడా 2016 నుంచి ఇప్పటి వరకు రూ.47.70లక్షలు ఖాతాలో మురుగుతున్నా రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆర్డీకి ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. ఇంకుడు గుంతల ద్వారా భూగర్భజలాలు వృద్ధి చేయడం ఉద్దేశం మంచిదే అయినా.. ఆ నిధులను దేనికీ వినియోగించలేదని, దీనిపై విచారణ చేపట్టాలని ఆయన ఆర్డీని కోరారు.

ఈజీఎస్ అనుసంధానంతో పశుగ్రాసం సాగు



పశుగ్రాసం సాగుపై బ్రోచర్లు ప్రదర్శిస్తున్న రైతులు, డాక్టర్ నీరజ

వాల్మీకిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం అనుసంధానంతో పశుగ్రాసాల సాగు చేపట్టి పాడి రైతులు లబ్ధిపొందాలని పశు సంవర్ధక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ అన్నారు. మంగళవారం గొల్లపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి ఆవులు, మేకలు, గొర్రెలు తదితర జీవాలకు నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తేనే అధిక పాల దిగుబడులు సాధ్యమవుతాయని రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు చరిత, సిబ్బంది రామ్మోహన్, బాబాజాన్, శివశంకర్, రెడ్డివరప్రసాద్, సురేంద్ర, శ్రీనివాసులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ పెండింగ్ పనులు పరిశీలించిన ఆర్డీఓ



రైల్వే క్రాసింగ్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

పీలేరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్‌ఓబీ పెండింగ్ పనులను మంగళవారం రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ పరిశీలించారు. చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ ప్రాంతంలో ఆర్‌ఓబీ కోసం సేకరించిన స్థలాలపై కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండడంతో వాటి పరిష్కారం కోసం ఆర్డీఓ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో పెండింగ్ కేసులు, పరిహారం పంపిణీ, హైకోర్టులో కౌంటర్ దాఖలు వంటి అంశాలపై ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా కోర్టు నుంచి ఉపశమనం లభించేలా చూసి ఆర్‌ఓబీ పనుల్లో పురోగతి సాధించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వర రావు, డీటీ రెడ్డప్ప రెడ్డి, సర్వేయర్ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం : సీపీఐ

మదనపల్లె అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన తరువాత వేలాదిమందికి ఉచిత వైద్యం అందిస్తున్న మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని తప్పు పట్టారు. ప్రభుత్వ వైద్యాన్ని వ్యాపారంగా మార్చడం, వ్యాపార వేత్తలకు ప్రభుత్వ ఆస్పత్రిని అప్పగించడం సరికాదన్నారు. మదనపల్లె ఆస్పత్రిని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప మాట్లాడుతూ కడప నుంచి రాయచోటి వయా మదనపల్లె బెంగళూరుకు రైల్వేలైన్ గత ప్రభుత్వం దారి మళ్లించిందని, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వస్తే రాయచోటి, మదనపల్లె మీదుగా రైల్వేలైన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ మొరవ పనులు పూర్తి చేసి మదనపల్లె ప్రజలకు తాగునీరు అందివ్వాలన్నారు నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దగ్ధం కేసును అటకెక్కించారని ఆరోపించారు. తమ గోడును కూటమి ప్రభుత్వానికి విన్నవించుకున్నా ప్రయోజనం లేదన్నారు. బీటీ కళాశాలను యూనివర్సిటీ చేయాలని డిమాండ్ చేశారు.

మేలుకోకపోతే నష్టపోతాం

ప్రభుత్వ ఆస్పత్రిని రక్షించుకోవాలి : సీపీఎం



సామూహిక దీక్షలు నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేటు పరం కాకుండా రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి ప్రజాసంఘాలతో కలిసి సీపీఐ, సీపీఎం సామూహిక దీక్షలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సామూహిక దీక్షలు చేపట్టారు. మొదటి రోజు ఐటీయూసీ, బీఎస్పీ, సీపీఐ, వీసీకే, బహస్, బహుజన సేన, సీఐటీయూసీ, పెన్షనర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ సంఘాలు మద్దతుగా దీక్షలో పాల్గొన్నాయి. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని, మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ వందేళ్లగా ఎందరో పేదలకు ఉచితంగా వైద్యం అందించిన ప్రభుత్వ ఆస్పత్రి ఇప్పుడు దయనీయ స్థితికి చేరుకోవడంలో కూటమి పెద్దల కుట్ర దాగిఉందన్నారు. బ్రిటీష్ హయాంలో కూడా అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రతినిధి డాక్టర్ చాంబర్లిన్ మదనపల్లెకు వచ్చి పేదల కోసం ఓ చిన్న కుటీరాన్ని ఏర్పాటు చేసి వైద్యం అందించారని గుర్తు చేశారు. ఏరియా ఆస్పత్రి నుంచి జిల్లా ఆస్పత్రి గాను ప్రస్తుతం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిగా రూపాంతరం చెందిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ మెడికల్ కళాశాలను రద్దు చేసి ఈ ప్రాంత ప్రజల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. మెడికల్ కళాశాల ఇక్కడ ఉంటే ఎన్నో రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేవని, తిరుపతి, బెంగళూరు, వెలూరు, చైన్నై లాంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే పేదలకు వైద్యం అందేదన్నారు. రాజకీయ కుట్రలో భాగంగా మెడికల్ కాలేజీని రద్దు చేయడం దురదృష్టకరమని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పెద్దల కార్పొరేట్ పైత్యం దేశానికే ప్రమాదకరమన్నారు. ఇప్పటికే డాక్టర్లు, స్టాఫ్ నర్సులు బదిలీ అవడం అన్యాయమన్నారు. ఇప్పుడు మదనపల్లె ప్రజలు, రాజకీయ నేతలు పార్టీలకు అతీతంగా మేలుకోకపోతే నష్టపోతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ సీఐటీయూ నేత హరింద్రనాథ్ శర్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఐటీయూసీ కన్వీనర్ కృష్ణమూర్తి, బహుజన సేన నేత శ్రీచందు, నర్సింహులు, ముత్యాలమోహన్ మాట్లాడారు.

కార్యక్రమంలో సీపీఎం నేతలు ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రఘునాథ్, సీఐటీయూ నేత రమాకృష్ణంరాజు, బీఎస్పీ నేతలు మద్దేపల్లె బాలాజీ, సీపీఐ కృష్ణప్ప, మురళీ, బాస్ నేతలు రెడ్డిప్రసాద్, గంగాధర్, ప్రజా సంఘాలు ముని వెంకటప్ప, ఉత్తన్న ,అంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు వితరణ



దివ్యాంగులకు వినికిడి యంత్రం అందిస్తున్న వెలుగు సెక్రటరీ

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు పంచాయతీలో అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో మంగళవారం దివ్యాంగులకు ఉపకరణాలు వితరణ చేసినట్లు వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ సహకారంతో వెలుగు సంస్థలో వినికిడి యంత్రం, వీల్‌చైర్స్‌ను దివ్యాగులకు అందజేశారు.

పారదర్శకంగా ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన

తంబళ్లపల్లె, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నట్లు ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. మంగళవారం ముగ్గురు వైద్య బృందం అధికారులు డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ సునీల్‌దత్, డాక్టర్ మునికుమార్ 29 ఆరోగ్య పింఛన్లను తనిఖీ చేశారు. కుక్కరాజుపల్లె సచివాలయ పరిధిలో 5, కోటకొండలో 8, రేణుమాకులపల్లెలో 4, కన్నెమడుగులో 7, ఎద్దులవారిపల్లెలో 5 పింఛన్లను తనిఖీ చేశారు. మండలంలో బుధవారం కోసు వారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లె-1 సచివాలయాల్లో, గురువారం గుండ్లపల్లె, చేలూరివాండ్లపల్లె, గోపిదిన్నె, కొట్టాల సచివాలయాల పరిధిలో ఆరోగ్య పింఛన్ల పునఃపరిశీలన ఉంటుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే తనయుడి జన్మదిన వేడుకలు



చిన్నారులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు జునైద్

మదనపల్లె టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు టీడీపీ యువనేత జునైద్ అక్బారి జన్మదిన వేడుకలను టీడీపీ నేతలు నిర్వహించారు. మంగళవారం స్థానిక బసినికొండ వద్ద కూరపర్తి సాయిచైతన్య అనాథాశ్రమంలో టీడీపీ నేత చిన్న మహేష్ ఆధ్వర్యంలో 150 మంది చిన్నారులకు జునైద్ ద్వారా అన్నదానం నిర్వహించారు. అనంతరం బసినికొండ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే నివాసంలో జునైద్‌కు నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి టీడీపీ నేతలు పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు నాదెళ్ల శివన్న, షంషీర్, రఘుపతి, దేవేంద్రచిన్ని, డిష్ చలపతి, ఎస్ఎం రఫీ, బాబు, పూలకుంట్ల హరి, సాయికిరణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రైతులతో పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌నాయక్

పెద్దతిప్పసముద్రం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువులకు, గొర్రెలకు, మేకలకు సంక్రమంచే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పెద్దతిప్పసముద్రం మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దతిప్పసముద్రం మండలం తుమ్మరకుంటలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత పశు వైద్యశిబిరాల్లో పశువులు, లేగదూడలు, మేకలు, గొర్రెలకు, పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ నాయక్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాల ద్వారా 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించామన్నారు. 680 గొర్రెలకు, 140 మేకలకు, 26 దూడలకు, 118 ఆవులకు బాహ్య పరాన్న జీవులను నియంత్రించడానికి బూటాన్ స్ప్రే చేశారు. తుమ్మరకుంట, టి.సదుం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరంలో పాడి రైతులకు పశు పోషణ గురించి అవగాహన కల్పించారు. గొర్రెలకు డీ వార్మింగ్ మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ సూచించారు. 20వ తేదీ నుంచి ఈ నెల 31 వరకు పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో జరిగే ఉచిత పశువైద్య శిబిరాల్లో మూగజీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందచేస్తారన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందిస్తామన్నారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువులకు సంక్రమంచే వ్యాధులపై అవగాహన కల్పించారు. పాడి రైతులు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తు న్న ఉచిత పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంచార పశువైద్య శిబిరం డాక్టర్ లోకేష్, శేఖర్, పాడి రైతులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ, బీపీ, షుగర్‌కు ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య హాస్పిటల్ సంయుక్తంగా మంగళవారం కిడ్నీ, బీపీ, షుగర్ సమస్యలకు వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో ప్రముఖ డాక్టర్ ప్రియా కాళహస్తి అమెరికా నుంచి విచ్చేశారు. 24 వతేదీ వరకు శిబిరం నిర్వహిస్తా మని డాక్టర్లు తెలిపారు. మొదటి రోజు ప్రజలు పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్వాస్థ్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్లు తనిఖీ

నిమ్మనపల్లె జనవరి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని దివ్యాంగ పెన్షన్‌లను ఐదు రోజులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేస్తు న్నారు. మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీలో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి రూ. 15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేశారు. తనిఖీలో నూతన పరికరాలను ఉపయోగించి పెన్షన్‌కు అర్హతపై నిర్ధారణ చేస్తున్నారు. దీనిపై పూర్తి నివేదికను ఉన్నతాధి కారులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

కోర్టులో గంగమ్మకు విశేషాలంకరణ



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ సభ్యులు విశేషంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో ఆలయ అర్చకుడు సుస్మిత్‌సాయి మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్స్ రాటకొండ రంగస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి మహేష్, మార్పూరి విక్కీ, దేవేంద్ర, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

ఎస్‌సీఈఆర్‌టీ స్టడీ మెటీరియల్ పంపిణీ

పీలేరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గూడరేవుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు శ్రీ కౌశిక్ మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఎస్‌సీఈఆర్‌టీ స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ ఆవుల రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు, వ్యక్తిగత క్రమశిక్షణ, భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన పెంచుకుని విద్యార్థి జీవితం నుంచే పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరత్నమ్మ, విశ్రాంత ఉపాధ్యాయులు పుల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు మదనమోహన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఆంజనేయులు, రాణి, చంద్రకళ, పీలేరు మండల టీడీపీ ఉపాధ్యక్షుడు హితేశ్, తదితరులు పాల్గొన్నారు.

బయల్పడిన దేవతామూర్తుల విగ్రహాల పరిశీలన



బయల్పడిన విగ్రహాలను పరిశీలిస్తున్న తహసీల్దారు హరికుమార్

తంబళ్లపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పొలంలో బయ ల్పడిన దేవతా మూర్తుల ప్రతి మలను తహసీల్దారు హరికుమార్ పరిశీలించారు. కోటకొం డ పంచాయతీ మద్దిరాళ్లపల్లె సమీపంలోని ఓ రైతు పొలంలో సోమవారం రెండు దేవతా మూర్తుల రాతి విగ్రహాలు బయల్పడిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం తహసీల్దారు కోటకొండకు వెళ్లి విగ్రహాలను పరిశీలించారు. గతంలో ఈ ప్రాంతలో పురాతన ఆలయాలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఓ చిన్న చెరువు, ఓ ఆలయం ఉండేదని, వర్షాల వలన చెరువు కట్ట తెగిపోవడంతో ఆలయం సహా విగ్రహాలు మట్టిలో పూడిపోయి ఉండవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. వీఆర్వో, కానిస్టేబుల్ రమణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాలం చెల్లిన నిత్యావసరాలను అమ్మితే చర్యలు

● జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ సమావుల్లా

గుర్రంకొండ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దుకాణదారులు కాలం చెల్లిన నిత్యావసరాలను అమ్మితే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ సమావుల్లా హెచ్చరించారు. మంగళవారం ఆయన గుర్రంకొండలో ఓ దుకాణంలో నిత్యావసరాలను కాలపరిమితిని తనిఖీ చేశారు. కాలం చెల్లిన పలు రకాల చాక్లెట్‌లను తనిఖీ చేసి సీజ్ చేశారు. దుకాణంలో నిత్యావసరాల పాకెట్ల కాలపరిమితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో మటన్, చికెన్ వ్యాపారులు రెండు మూడు రోజులు ఫ్రీజ్‌లో ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. రోగంతో చనిపోయే గొర్రెలు, మేకలను కోసి మాంసం అమ్ముతున్నట్లు ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి మాంసం అమ్మే వ్యాపారుల వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వ్యాపారాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'అక్రమ నిర్మాణాలు చేపట్టి మాపైనే ఫిర్యాదు చేశారు'

నిమ్మనపల్లె జనవరి 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మాణాలు చేపట్టి తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని ముష్టూరు పంచాయతీ దిగివపల్లె గ్రామస్థులు ఆరోపించారు. దిగువపల్లెలో బాలేచంద్ర నిర్మించిన ఇంటి జాగాపక్కనే మొత్తం భూమి సెటిల్‌మెంట్ ఉందన్నారు. గతంలోనే ఈ భూమిపై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. తన ఇంటి పక్కనే ఉన్న సెటిల్‌మెంట్ జాగాను అక్రమించుకోవడమే గాకుండా ఇప్పుడు గ్రామస్థులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై తాను కూడా పోలీసులను ఆశ్రయిస్తునట్లు గ్రామస్థులు తెలిపారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

వాల్మీకిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పూర్వం పెద్దల నుంచి ఉన్న దారిని ఓ టీడీపీ నేత ఆక్రమించాడని వాల్మీకిపురం పట్టణ శివారు ప్రాంతంలోని చాలక బండ ప్రాంతానికి చెందిన దాదాపు 60మంది ప్రజలు తహసీల్దార్ పామిలేటికి ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి ఉన్న దారిని ఎందుకు మూసేశారని ప్రశ్నిస్తే ఈ దారికి సంబంధించి తన వద్ద పట్టా ఉందని, ఇది పట్టా భూమి అని మీరు వేరే దారిని చూసుకోవాలని బదులిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారిలేక పోతే తమకు ఇబ్బందులు తప్పవని బాధితులు వాపోయారు. తక్షణమే తమకు దారి సమస్యను విచారించి, న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ తమ అధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'సమాచారం' ఇవ్వని డాక్టర్‌పై ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె పీహెచ్‌సీపై సమాచారం హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వని డాక్టర్‌పై మదనపల్లె సీఐ రామచంద్రకు రెండు రోజుల కిందట ఫిర్యాదు చేసింది. సుభాష్‌రోడ్డు వాసి, సోషియల్ వర్కర్ టి.రంగమ్మ సమాచార హక్కు చట్టంతో కొన్ని వివరాలను కోరింది. అయితే నిమ్మనపల్లె పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ బాబు సమాచారం ఇవ్వకపోగా రంగమ్మను నానాబూతులు తిట్టి వాట్సాప్‌లో పోస్టు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం ఆమె ఫిర్యాదుపై డాక్టర్ రమేష్‌బాబు, రంగమ్మను మదనపల్లె టూటౌన్‌కు పిలిపించి సీఐ విచారణ చేపట్టారు.

'వర్గీకరణతో నష్టం'

వాల్మీకిపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు నష్టం జరుగుతుందని తెలుపుతూ మంగళవారం చిత్తూరుకు విచ్చేసిన ఏక సభ్య కమిషన్ రాజీవ్ శుక్లాకు వాల్మీకిపురం మాలమహానాడు నేతలు వినతి పత్రం అందించారు. వాల్మీకిపురం నుంచి రెండు బస్సుల్లో మాలమహానాడు నేతలు దాదాపు వందమంది పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం చిత్తూరుకు బయలుదేరి వెళ్లారు. వర్గీకరణతో మాలలకు జరిగే నష్టాన్ని రాజీవ్ శుక్లాకు వివరించారు. జిల్లా మాలమహానాడు నేతలు వెంకటస్వామి, సుధాకర్, శ్రీనివాసులు, నాగార్జున, ప్రవీణ్, శ్యాంసుందర్, మార్టిన్, గురుప్రసాద్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు

కలకడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ప్రమీలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కోన గ్రామానికి చెందిన ప్రమీల నుంచి 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హుస్సేన్ బాబాదర్గా గంధోత్సవం

మదనపల్లె టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బసినికొండ వద్ద వెలసిన అబ్దాల్ హుస్సేన్‌బాబా దర్గా గంధోత్సవం సోమవారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పెనుగొండ సర్దార్ తాజ్‌బాబా హాజరై దర్గాలో చాదర్ సమర్పించా రు. వీరికి దర్గా నిర్వాహకులు సబ్దాద్ పర్వేజ్ అబ్దుల్ హుస్సేని, తబ్రేజ్‌బాబా పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం రఫీ, దర్గా ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమితోనే 'విశాఖ ఉక్కు'కు పునరుజ్జీవం : ఎమ్మెల్యే



తిరుపతి తొక్కిసలాట బాధితులకు టీటీడీ మంజూరు చేసిన చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి మణిహారమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వైసీపీ పాలనలో అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌పై వున్న కేసుల నుంచి విముక్తి కోసం న్యూఢిల్లీకి వెళ్లి వచ్చారే కానీ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదన్నారు. నేడు సీఎం చంద్రబాబు న్యూఢిల్లీకి వెళ్లివచ్చిన ప్రతిసారీ రాష్ట్రానికి వేల కోట్లు నిధులు తీసుకొస్తున్నారని, ఇప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,400 కోట్లు ఆర్థిక ప్యాకేజీ తెచ్చారన్నారు. 2002లోనే విశాఖ ఉక్కు పరిశ్రమ లాభాల బాటన నడిపించిన ఘనత టీడీపీ ప్రభుత్వాని కే దక్కిందన్నారు. ప్రజల సొమ్మును దోచుకో, దాచుకో అన్న చందంగా వైసీపీ పాలన సాగిందని, కాని చంద్రబాబు ఏడు నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి రెండు కన్నులుగా చేసుకుని పాలన అందిస్తున్నారన్నారు. మార్చి నుంచి సీఎం చంద్రబాబు అభివృద్ధి పనులకు వరదల్లా నిధులు కురిపించనున్నారన్నారు. తిరుపతి ఘటనలో గాయపడిన రామసముద్రం మండలం వాసులు మునిరెడ్డి, రెడ్డెమ్మ, నందీష్‌కు టీటీడీ చైర్మన్ మంజూరు చేసిన రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.6లక్షల చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, టీడీపీ నేతలు బాలుస్వామి, నాగార్జున గాంధి, షంషీర్, జాన్‌బాబు, జేసీబీ మధు, చంద్రశేఖర్, నవీన్‌చౌదరి, మడితం నాగరాజు, నాగమణి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.